పల్లెల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

6

నిరుపేదలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం



సర్వరాజ్‌పూర్‌లో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న జువ్వాడి నర్సింగరావు 6

ముగిసిన మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు

6



పీఏసీఎస్‌లకు ప్రత్యేక అధికారులు

- ఇన్‌చార్జి పాలన నుంచి ఆరోపణల పీఏసీఎస్‌లు అవుట్
- జిల్లాలో 23 సొసైటీలకు అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిలు
- ఉత్తర్వులు జారీ చేసిన సహకార శాఖ ఉన్నతాధికారులు
- అవినీతి, అక్రమాలు, అవకతవకలే కారణం

జిల్లాలో అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిలు వీరే..

పర్సన్‌ఇన్‌చార్జి పేరు	పీఏసీఎస్ పేరు
ఎ మల్లేశం	తిమ్మాపూర్, పోతారం, కల్లెడ,
సాయికుమార్‌గౌడ్	జగిత్యాల, ఇటిక్యాల, పోరుమల్ల
సుజాత	నూకపల్లి, మేడిపల్లి
సీహెచ్ మల్లేశం	గంబీర్‌పూర్, వల్లంపల్లి, అయిలాపూర్
నాగ సంకీర్త్	తిమ్మాపూర్, మాదాపూర్, భూషన్‌రావుపేట
సత్యనారాయణ	పెగడపల్లి, గొల్లపల్లి, ధర్మపురి
ఎం శ్రీనివాస్	సిరిపూర్, చిట్టాపూర్, యామాపూర్
ఎండీ అసద్	మల్లాపూర్, మెట్లచిట్టాపూర్, భూపతిపూర్

జగిత్యాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ (పీఏసీఎస్)ల వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. ప్రభుత్వం సుమారు నెల రోజుల క్రితం రెండోసారి పీఏసీఎస్‌ల పాలకమండళ్ల గడువు పెంచగా, జిల్లాలో 23 సొసైటీలకు బ్రేక్ పడింది. సంబంధిత సొసైటీలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ శుక్రవారం సహకార శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ యేడాది ఫిబ్రవరి 14వ తేదీతో పాలక వర్గాల పదవీ కాలం ముగియగా...ఆరు నెలల పాటు పాలకవర్గం గడువు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల ఆగస్టు 14వ తేదీన మొదటిసారి ఇచ్చిన గడువు ముగియడంతో పాలక మండళ్లకు మరో ఆరు నెలల పాటు అవకాశం ఇస్తూ రెండో పర్యాయం ఆదేశాలు జారీ చేసింది. దీంతో వచ్చే యేడాది ఫిబ్రవరి 14వ తేదీ వరకు పాలక మండళ్లకు గడువు

మిగతా 6వ పేజీలో

ప్రభుత్వ నిర్ణయం మేరకే...

మనోజ్ కుమార్, జిల్లా సహకార శాఖ అధికారి, జగిత్యాల



జిల్లాలో 23 సహకార సంఘాలకు ప్రభుత్వ నిర్ణయం మేరకు అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జీలను నియమించాము. వచ్చే రెండు, మూడు రోజుల్లో సంబంధిత పర్సన్ ఇన్‌చార్జీలు బాధ్యతలను స్వీకరిస్తారు. సహకార చట్టానికి వ్యతిరేకంగా పనిచేసినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సంఘాల్లో అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జీలను ప్రభుత్వం నియమించింది.



నిండుగా 'వరద'

వరదకాలువ నిండుగా ప్రవహిస్తోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి కొన్ని రోజులుగా నీటిని విడుదల చేస్తుండగా ప్రస్తుతం కాలువలో 8,000క్యూసెక్కుల నీరు వస్తుంది. దీంతో రామన్నపేట శివారులో గల వంతెన వద్ద నిండుగా కనిపిస్తోంది. - మల్యాల



కంకర లేచి.. ప్రమాదంగా మారి..

మండలంలోని రామన్నపేట నుంచి మద్దుట్ల మీదుగా గొర్రెగుండం వెళ్లె రహ దారి అధ్వానంగా మారింది. కంకర లేచి, గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా మారింది. దీంతో ఈ రహదారిపై ప్రయాణం అంటేనే ప్రజలు జంకుతున్నారు. ప్రమాద కరంగా మారిన ఈ రహదారికి మరమ్మతు చేయాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు. - మల్యాల

యమధర్మరాజు ఆలయంలో అభిషేకం

ధర్మపురి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి అనుబంధ యమధర్మరాజు ఆలయంలో శుక్రవారం స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు స్వామి వారికి రుద్రాభిషేకం, పురుషసూక్తం, లక్ష్మీసూక్తం, మన్యుసూక్తంతో అభిషేకం, ఆయుష్య హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

అన్నదానం కోసం రూ. లక్ష విరాళం

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరిగే అన్నదానం కోసం బాన్సువాడకు చెందిన రమాకాంత్‌రావు కులకర్ణి లక్ష రూపాయల విరాళం శుక్రవారం అందించారు. ఆలయంలో స్వామి దర్శనం చేసుకున్న అనంతరం రమాకాంత్‌రావు దంపతులు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్‌కు విరాళం అందించారు. ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు వితరణ

కథలాపూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కల్లూరి మల్లేశ్-జాగృతి దంపతులు ఐదు వేల రూపాయల విలువైన భోజన ప్లేట్లను శుక్రవారం పాఠశాలలో వితరణ చేశారు. మధ్యాహ్న భోజనం చేసేందుకు విద్యార్థులకు ఎంతో సౌకర్యవంతంగా మారిందని హెచ్‌ఎం శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా దాతలకు హెచ్‌ఎం కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

మల్యాల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలో జరిగిన మూడో జూనియర్ డాడ్జ్‌బాల్ నేషనల్ సెలక్షన్స్ ట్రయల్స్‌లో ప్రతిభ చాటిన మల్యాల శ్రీవాగ్దేవి విద్యాసంస్థల విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలకు సహస్ర, సింధూ, అక్షర, సహస్ర, హర్షిత, మహాలక్ష్మీ, శివసాయి, జేమ్స్ ఎంపిక కాగా గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని కరస్పాండెంట్ పోకల నరేశ్‌కుమార్ తెలిపారు. పీఈటీలు అక్షయ్, తిరుపతి, ఆశిక్, రేఖ, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

వ్యాధులపై అవగాహన

మల్యాల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బల్వంతాపూర్‌లో మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సామూహిక ఆరోగ్య చైతన్య కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా సర్వే చేసి సంపూర్ణ ఆరోగ్యానికి తీసుకోవల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. రమేశ్, జ్యోతి, రమనమ్మ, రాజమ్మ, స్వప్న పాల్గొన్నారు.

రాష్ట్రంలో విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్యం

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



మాతా శిశు కేంద్రం సిబ్బందికి వాక్సినేషన్ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యా వైద్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ముందస్తు జాగ్రత్తలతో ప్రజలు వ్యాధుల బారి నుంచి బయట పడవచ్చని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మాతా శిశు కేంద్రంలో ఆరోగ్య కార్యకర్తలకు హైపటైటిస్ బి వాక్సినేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హైపటైటిస్ బి వాక్సిన్‌పై గ్రామగ్రామాన ప్రజాప్రతినిధులతో పాటు వైద్యులు అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్, ఉప వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్, సూపరింటెండెంట్ జివి కృష్ణమూర్తి, రిజనల్ మెడికల్ ఆధికారులు డాక్టర్ సుమన్, డాక్టర్ గీతిక, డాక్టర్ ఆగంతపు నరేష్, డాక్టర్ శ్రీకాంత్, మాతా శిశు కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

- జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 20 లక్షల నిధులతో చేపట్టే తరగతి గదుల నిర్మాణానికి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషన్ స్పందన, నాయకులు గోలి శ్రీనివాస్, బాలె శంకర్, ఏఈ అనిల్, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల తొలగింపునకు తీర్మానం

కథలాపూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో అసౌకర్యంగా ఉన్న విద్యుత్ స్తంభాలను రు. 24.79 లక్షలతో తొలగించడానికి ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. శుక్రవారం ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. విద్యుత్ శాఖ అధికారులు అసౌకర్యంగా ఉన్న స్తంభాలను తొలగించి మరో చోట వేయడానికిగాను అంచనాలు తయారు చేసి మార్కెట్ కమిటీ అధికారులకు అందజేశారు. ఈ నేపథ్యంలో పాలకవర్గం ఆ డబ్బులు చెల్లించేందుకు అంగీకరిస్తూ తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్‌పర్సన్ పులి శిరీష, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం ఆకు, తంబాకు ఇస్తున్నారని మహిళల నిరసన

కథలాపూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బీడీలు చుట్టడానికి పనికి రాకుండా ఉంటున్న నాసిరకం ఆకు, తంబాకు ఇస్తూ యాజమాన్యం తమను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపిస్తూ శుక్రవారం తాండ్ర్యాలలో దేశాయ్ బీడీ కంపెనీ ఎదుట మహిళా బీడీ కార్మికులు ఆందోళనకు దిగారు. ఇప్పటికే అనేక సార్లు యాజమాన్యం దృష్టికి తెస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. టేకేదార్లు తాము చేసిన బీడీలు ఇచ్చే సమయంలో విటారా కంపనీకి చెందిన నాసిరకం చిప్స్ స్వీట్లు అంటగడుతున్నారని వీటితో తమ పిల్లల ఆరోగ్యం చెడిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని తీసుకోకపోతే వేతనంలో డబ్బులు కోత వేస్తామని బెదిరిస్తున్నట్టు చెప్పారు. యాజమాన్యం, టేకేదార్లపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

సమయపాలన పాటించాలి

కలెక్టర్ సత్యప్రసాద్

అంబారిపేట పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

కథలాపూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైద్యసిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు సేవలందించాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. మండలంలోని అంబారిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అక్కడ ఉన్న రోగులను పలకరించి వైద్యులు సేవలందిస్తున్నారా, మందులు ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మిస్తున్న పీహెచ్‌సీ భవనం పనులు ఎందుకు కొనసాగడం లేదని సంబంధిత విభాగం ఇంజినీర్లను ప్రశ్నించారు. డిసెంబరులోపు పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు చెప్పామని కలెక్టర్‌కు అధికారులు వివరించారు. పీహెచ్‌సీ ఆవరణలో ఏళ్ల కిందట నిర్మించిన శిథిలావస్థలో ఉన్న క్వార్టర్లను తొలగించాలని ఎంపీడీవోకు సూచించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల ప్రగతిని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. బిల్లులు సకాలంలో అందుతున్న నేపథ్యంలో పనులు వేగంగా జరిగేలా చూడాలని అన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న వారికి సెర్ప్ ద్వారా రుణాలు ఇప్పించేలా చూడాలని ఆదేశించారు. అదేవిధంగా చింతకుంట, భూషణరావుపేటలో గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో కొనసాగుతున్న గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనుల ప్రగతిని పరిశీలించి ఎందుకు పనులు అర్ధాంతరంగా నిలిపివేశారని కాంట్రాక్టర్లను ప్రశ్నించగా రెండు నెలల్లో పూర్తి చేస్తామని చెప్పారు. కాగా పాఠశాలలో అదనపు తరగతి గదులు, టీచర్లు, ప్రహారీ, మినీ స్టేడియంకు నిధుల కేటాయించాలని చింతకుంట గ్రామస్థులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జవాకర్‌రెడ్డి, తహసీల్దార్ వినోద్, ఎంపీడీవో శంకర్ నాయక్, హౌసింగ్ శ్రీయ, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జవ్వాజి రవి, జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

రాయికల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని మాజీ ఎంపీపీ కాటిపెల్లి గంగారెడ్డి అన్నారు. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే కుంగ్‌ఫూ పోటీల్లో బంగారు పతకం సాధించిన పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఊట్నూరి జాహ్నవిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. అలాగే వృత్తి నిబద్ధతతో పనిచేస్తున్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు సీమలదారి సదాశివ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా జాహ్నవికి ఆర్‌యూపీపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు వేల్పుల స్వామి యాదవ్ భగవద్గీతను ప్రదానం చేశారు. మాజీసర్పంచ్ సామల్ల లావణ్యవేణు, మాజీ ఎంపీటీసీ కొమ్ము రాధఆదిరెడ్డి, కార్యదర్శి తోట రాజేష్, రొట్టె శ్రీధర్, కనపర్తి శ్రీనివాస్, మండలోజు శ్రీనివాస్, జియావుద్దీన్, ముజాహిద్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని సన్మానిస్తున్న నాయకులు

కాలనీల్లో పర్యటించిన మాజీ మంత్రి



కాలనీలో పరిశీలిస్తున్న మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి

జగిత్యాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి శుక్రవారం పర్యటించారు. పట్టణంలోని 25,26వ వార్డులను సందర్శించి స్థానిక పరిస్థితులను పరిశీలించారు. రహదారుల అభివృద్ధికి అవసరమైన అంశాలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక పరిస్థితులను అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరించారు. కాగా గాంధీ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన సహకారాలను అందిస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జిల్లా గంగాధర్, దుర్గయ్య, రమేశ్ రావు, నక్క జీవన్, బొల్లి శేఖర్, గిరిధర్, అనిల్, మదు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలపై జీఎస్టీ ఎత్తివేయాలి

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) :చేనేత వస్త్రాలపై జీఎస్టీ ఎత్తివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం వసంత విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. దేశంలో వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది చేనేతపై ఆధారపడి జీవిస్తున్నారని అలాంటి రంగంపై 12 శాతం ఉన్న పన్నును 18 శాతానికి పెంచడం దారుణమన్నారు. బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వర్ రావు, గంగాధర్, అనురాధ, ప్రణయ్, మనోజ్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్యాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల, తక్కళ్లపల్లి సబ్‌స్టేషన్ల వద్ద శనివారం మరమ్మత్తులు జరుగనున్న దృష్ట్యా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈఈ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని మల్యాల, ముత్యంపేట, రాజారం, నూకపల్లి, మల్యాల క్రాస్‌రోడ్డు, తక్కళ్లపల్లి, మ్యాడంపల్లి, మానాల గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగాదారులు సహకరించాలని కోరారు.

రాయికల్: రాయికల్ ఉప కేంద్రం, 33 కేవీ రాయికల్ ఫీడర్‌లో షెడ్యూల్డ్ మెయింటనెన్స్ పనుల కారణంగా శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జగిత్యాల డీఈ గంగారాం తెలిపారు. రాయికల్, మహితాపూర్, కుమ్మరిపల్లి గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

కొడిమ్యాల: కొడిమ్యాల విద్యుత్ సబ్ స్టేషన్ మేనైనెన్స్ దృష్ట్యా శనివారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కొడిమ్యాల, రామకిష్టాపూర్, కొండాపూర్, చింతల్లపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు శుక్రవారం విద్యుత్ శాఖ ఏడీఈ ఆర్. మహేందర్, ఏఈఈ రఘునాథ్ తెలిపారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

జగిత్యాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లలో భాగంగా ఈనెల 15,16వ తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ తత్వాది ప్రమోద్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ (హెచ్‌ఈపీ) ఇంగ్లీష్ మీడియంలో మూడు, బీఎస్సీ ఫిజికల్ సైన్స్‌లో ఏడు, లైఫ్ సైన్స్‌లో ఆరు, బీకాం కంప్యూటర్‌లో ఐదు, బీఏ (హెచ్‌ఈపీ)ఉర్దూ మీడియంలో 29 సీట్లు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులు ధ్రువపత్రాలతో ఈనెల 15,16వ తేదీల్లో కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా రాజాగౌడ్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న అదనపు కలెక్టర్ రాజాగౌడ్

జగిత్యాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా రాజా గౌడ్ శుక్రవారం బాధ్య తలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ సత్యప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్యం, జ్వరాలు విజృంభించకుండా జాగ్రత్తలు పాటించడం వంటి వాటిపై దృష్టి సారిస్తానన్నారు. అదనపు కలెక్టర్ రాజాగౌడ్‌ను కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి హకీంతో పాటు పలువురు అభినందించారు.

అంజన్నను దర్శించుకున్న అదనపు కలెక్టర్

మల్యాల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా నూతనంగా నియమితులైన రాజాగౌడ్ శుక్రవారం కొండగట్టు అంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన అదనపు కలెక్టర్‌కు ఎంపీడీవో స్వాతి, ఎంపీవో ప్రవీణ్, పంచాయితీ కార్యదర్శులు స్వప్న, శ్రీకాంత్, ఆర్ఐ తిరుపతి తదితరులు స్వాగతం పలుకగా ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అంజన్న దర్శనం అనంతరం బాధ్యతలు చేపట్టడానికి జగిత్యాలకు వెళ్లారు.

జగిత్యాల అర్బన్: సీనియర్ సిటీజన్స్ సమాజ మార్గదర్శకులని జగిత్యాల అడిషనల్ కలెక్టర్ బి. రాజా గౌడ్ అన్నారు. స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన ఆయనను జగిత్యాల సీనియర్ సిటీజన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలోని సభ్యులు కలిసి పుష్పగుచ్ఛం అందించారు. సీనియర్ సిటీజన్స్ నాయకులు గౌరిశెట్టి విశ్వనాథం, హన్మంత రెడ్డి, వెల్ముల ప్రకాశ్ రావు, డిండిగాల విఠల్, కట్ట గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతమైన విచారణతోనే నిందితులకు శిక్షలు



మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్, పక్కన డీఎస్పీ రఘుచందర్

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నేర విచారణ, నిరూపణ సమర్థవంతంగా చేయడం ద్వారానే నిందితులకు కోర్టుల ద్వారా శిక్షలు పడే అవకాశం ఉంటుందని ఎస్పీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఇన్వెస్టిగేషన్ అండ్ బిల్డింగ్ ది కేస్ ఫైల్ అనే అంశంపై పోలీస్ అధికారులకు శుక్రవారం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ హాజరై మాట్లాడుతూ ఫిర్యాదు స్వీకరణ నుంచి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకషంగా పరిశోధన చేసి నేరస్తులకు శిక్షపడేలా అధికారులు పనిచేయాలన్నారు. పోక్సో, అట్రాసిటీ కేసుల్లో ప్రణాళిక ప్రకారం విచారణ చేపట్టి కోర్టుల్లో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. అనంతరం సాక్ష్యాలను సేకరించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీ రఘుచందర్, సీఐలు కరుణాకర్, అనిల్‌కుమార్, సురేష్, సుధాకర్, రాంనర్సింహారెడ్డి, రవి తదితరులు ఉన్నారు.

అన్నివర్గాల సహకారంతో బాల్య వివాహాల నియంత్రణ

జగిత్యాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల సహకారంతోనే బాల్య వివాహాల నియంత్రణ సాధ్యమవుతుందని సహాయ చైల్డ్ రైట్స్ ఎన్‌జీవో జిల్లా కో ఆర్డినేటర్ భూమేశ్ అన్నారు. శుక్రవారం పలు ప్రాంతాల్లో బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బృందం సభ్యులు లత, లహరి, శ్యామల, మధు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

పాస్‌పోర్ట్ పోయినది

★ కొర్వి గంగరాజు తండ్రి: పీరయ్య, R/O. ఇ.నెం. 2-70, గ్రామం: గుమకుల కొండాపూర్, మం॥ గన్నేరువరం, జిల్లా: కరీంనగర్, తేది: 30-08-2025 రోజున నేను గుమకుల కొండాపూర్ నుండి కరీంనగర్‌కు వస్తున్న ప్రయాణంలో నా ఒరిజిల్ పాస్‌పోర్ట్ పోయినది. పాస్‌పోర్ట్ నెం.N2457060 దొరికినవారు అందజేయగలరు. సెల్: 7893439052

AJK-17230

పాస్‌పోర్ట్ పోయినది

★ సైండ్ల కరుణాకర్ తండ్రి: శంకర్, ఇ.నెం. 1-36, గ్రామం: షానగర్, మం॥ రామడుగు, జిల్లా: కరీంనగర్. తేది: 10-09-2025 రోజున నేను జిరాక్స్ సెంటర్ నుండి మా ఇంటికి (షానగర్) వస్తున్న ప్రయాణ సమయంలో నా ఒరిజిల్ పాస్‌పోర్ట్ పోయినది. పాస్‌పోర్ట్ నెం.G0776195 దొరికినవారు అందజేయగలరు. సెల్: 9642506461

AJK-17231

CHANGE OF NAME

According to the SSC memo My Name **Katta Vakula**, D/O. **Katta Srinivas**, after marriage I became **Puli Avanthika**, W/O. **Puli Santhosh Kumar**, which are the only two names I have

AJK-

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.

పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

3+2 స్కీం కలదు

ఆంధ్రజ్యోతి ప్రకటనలకై సంప్ర: 99854 11174

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి

కరీంనగర్ :- సెల్: 9703618691, 9985410640

జగిత్యాల, మెట్‌పల్లి :- సెల్: 99854 11262

వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063

తెలంగాణ ఎన్టీపీసీ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్

- కేంద్రం నుంచి పర్యావరణ అనుమతులు
- స్టేజ్ 2లో 2400 మెగావాట్ల ప్లాంటు నిర్మాణం



తెలంగాణ ఎస్టీపీపీ ప్రాజెక్టు స్టేజ్ 1

జ్యోతినగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీకి చెందిన తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు (టీఎస్‌టీపీపీ)కు ఎట్టకేలకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. 2400 మెగావాట్ల సామర్థ్యంగల టీఎస్ టీపీపీ రెండో దశ ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ పర్యా వరణ అనుమతులను(ఈసీ) గురువారం రాత్రి సర్క్యులర్ జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం నిర్మించాల్సిన 4 వేల మెగావాట్ల టీఎస్‌టీపీపీకి సంబంధించి 1600 మెగావాట్ల స్టేజ్1 ఇప్పటికే పూర్తయి విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. 2016లో శంకుస్థాపన అయిన స్టేజ్ 1 ఏడాదిన్నర క్రితం పూర్తయింది. మిగతా 2400 మెగావాట్ల(800 మెగావాట్ల 3 యూనిట్లు) ప్రాజెక్టుకు సంబంధించి ఈ ఏడాది జనవరి 28న పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఎనిమిది నెలల తరువాత కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్సును ఇచ్చింది.

● తెలంగాణ సూపర్ థర్మల్ కేంద్రం నేపథ్యం..

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన మేరకు ఎన్టీపీసీ సంస్థ తెలంగాణలో 4 వేల మెగావాట్ల ప్రాజెక్టును నిర్మించాలని పేర్కొంది. ఈ మేరకు రామగుండం ఎన్టీపీసీలోనే 4వేల ప్రాజెక్టును నెలకొల్పేందుకు కేంద్రం ఎన్టీపీసీకి అనుమతినిచ్చింది. మొదటగా 1600 మెగావాట్ల ప్రాజెక్టును రామగుండంలో 2016లో మొదలుపెట్టారు. ప్రధాని నరేంద్ర మోదీ టీఎస్‌టీపీపీకి శంకుస్థాపన చేశారు. 5 సంవత్సరాలలో పూర్తి కావాల్సిన స్టేజ్ 1 కరోనా ఇతర కారణాల వల్ల 2023లో పూర్తయింది. స్టేజ్ 1లో 800 మెగావాట్ల రెండు యూనిట్లను ప్రధాని మోదీ 2024లో జాతికి అంకితం చేశారు. రెండో దశలో 2400 మెగావాట్ల ప్రాజెక్టుకు ఎన్టీపీసీకి గత ఏడాది ఎన్టీపీసీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు అనుమతినిచ్చారు. సుమారు 29,800 కోట్ల రూపాయల వ్యయానికి బోర్డు అనుమతినిచ్చింది. దీంతో స్టేజ్ 2 నిర్మాణానికి సంబంధించి ఈ ఏడాది జనవరి 28న పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. రెండో దశ కాంట్రాక్టు బీహెచ్ఈఎల్‌కు లభించింది. టీఎస్‌టీపీపీ నుంచి 85 శాతం విద్యుత్ తెలంగాణకే కేటాయిస్తారు. మరో ఒకటి, రెండు నెలల్లో ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభించే అవకాశాలున్నాయి. 2030 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు మొదలు పెట్టనుంది.

● కొనుగోలుకు ఒప్పందంపై సందిగ్ధత..

టీఎస్‌టీపీపీ స్టేజ్ 2కు సంబంధించి విద్యుత్ కొనుగోలు ఒప్పందం(పీపీఏ) విషయంలో ఇంకా సందిగ్ధత ఉంది. పీపీఏ చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తి చూపడం లేదు. స్టేజ్2 నుంచి యూనిట్‌కు 4.12 రూపాయలకు కొనుగోలు చేసుకునేందుకు ఈఆర్‌సీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినప్పటికీ రాష్ట్ర సర్కారు పీపీఏ చేసుకోలేదు. 800 మెగావాట్ల విద్యుత్ మాత్రమే కొనుగోలు చేసుకునేందుకు గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పటికీ పీపీఏ మాత్రం చేసుకోకపోవడం గమనార్హం. పీపీఏ విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయం కోసం ఎన్టీపీసీ వేచి చూస్తున్నట్లు సమాచారం.

టీఎస్‌టీపీపీ స్టేజ్ 2 వివరాలు..

- **సామర్థ్యం:** 2400 మెగావాట్లు(800 మెగావాట్ల 3 యూనిట్లు)
- **ప్రాజెక్టు వ్యయం:** 29,800 కోట్లు
- **టెక్నాలజీ:** ఆధునిక సూపర్ క్రిటికల్ టెక్నాలజీ
- **నీటి సౌకర్యాం:** సమీపంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి పైపులైన్ ద్వారా సరఫరా
- **బొగ్గు లింకేజీ:** సింగరేణి నుంచి ఏడాదికి 11.5 మిలియన్ టన్నుల బొగ్గు

కరీంనగర్‌లో సినిమా షూటింగ్



ఎల్ఎండీ గేట్ల వద్ద జరుగుతున్న షూటింగ్

తిమ్మాపూర్ (మానకొండూర్), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): లోయర్ మానేరు డ్యాం వద్ద హీరో శ్రీకాంత్ సినిమా షూటింగ్ శుక్రవారం జరిగింది. ఏడు కొండలవాడా వెంకటరమణ(గోవిందా గోవిందా) అనే శీర్షికతో సినిమా తెరకెక్కనుంది. ఈ సినిమాలో డ్యామ్‌లో పడ్డ హీరోను చూస్తూ విలపిస్తున్న సంఘటన చిత్రీకరణ చేశారు. హీరోయిన్ లయ తదితర తారాగనం వివిధ పాత్రలలో నటించారు. ఈ సందర్భంగా హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ కరీంనగర్‌కు ఎన్నోసార్లు వచ్చాను... కానీ షూటింగ్ మాత్రం ఇదే మొదటి సారి అని అన్నారు. కరీంనగర్‌లో సినిమా షూటింగ్ చేయడం సంతోషంగా ఉందని ఇక్కడి అధికారులు, పోలీసులు అన్ని విధాలుగా సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. పది రోజులు ఇక్కడే షూటింగ్ జరుగుతుందన్నారు. నవంబరులో సినిమా రిలీజ్ అవుతుందని తెలిపారు.

మొరాయించిన రైల్వే గేటు

● గంటపాటు నిలిచిన రాకపోకలు



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

గంగాధర, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గంగాధర ప్రధానరహదారిపై గల రైల్వేగేటు శుక్రవారం మొరాయించింది. గేటు లేవకపోవడంతో గంటపాటు ప్రధానరహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయి రాకపోకలకు తీవ్రఇబ్బంది పడ్డారు. అనంతరం సిబ్బంది మరమ్మతులు జరిపి గేటు ఎత్తారు. కరీంనగర్, జగిత్యాలలో పనిచేస్తున్న ఉద్యోగులు గేటు లేవకపోవడంతో తీవ్రఇబ్బందులుపడ్డారు. వరంగల్, నిజామాబాద్, హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులు సమయానికి గమ్యం చేరలేకపోతున్నామని వాపోయారు. తరచుగా ఇదేపరిస్థితి ఎదురవుతోందని ప్రయాణికులు వాపోయారు. అధికారులు గేటు మొరాయించకుండా చూసి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

మందు బాబులకు జరిమానా

వేములవాడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన 130మంది మందుబాబులకు వేములవాడ న్యాయస్థానం జరిమానా విధించినట్లు పట్టణసీఐ వీరప్రసాద్ తెలిపారు. 14రోజుల వ్యవధిలో మద్యం సేవించివాహనాలు నడుపుతూ పట్టుబడిన 130మందిని శుక్రవారం వేములవాడ న్యాయస్థానంలో హాజరుపరిచామని తెలిపారు. ఇందులో 30మందికి 10వేల చొప్పున, 30మందికి 5వేల చొప్పున, మరో70మంది వాహనదారులకు 2000 రూపాయల చొప్పున న్యాయమూర్తి ప్రవీణ్ జరిమానా విధించినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాల నడిపిన వారికి కౌన్సె లింగ్ నిర్వహించి మరోసారి మద్యం సేవించకుండా వారితో ప్రతిజ్ఞ చేయించినట్లు ఆయన వెల్లడించారు. ట్రాఫిక్ ఎస్ఐ రాజు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. నలుగురికి గాయాలు

శంకరపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవపట్నంలో శుక్రవారంఆటో అదుపుతప్పి బోల్తాపడడంతో నలుగురు మహిళలు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇద్దరు పురుషులు, నలుగురు మహిళలు హుజూరాబాద్ మండలం చెల్పూర్ నుంచి ఆటోలో బయలుదేరి మొగిలిపాలెం వెళ్తున్నారు. ఈ క్రమంలో కేశవపట్నం గ్రామంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు మహిళలకు గాయాలుకాగా వారిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

గంజాయి రవాణా చేస్తున్న నిందితుడి అరెస్ట్

- రూ.2.4 లక్షల విలువైన గంజాయి స్వాధీనం
- పరారీలో ఇద్దరు



నిందితుడిని అరెస్టు చూపిస్తున్న ఏసీపీ గజ్జి కృష్ణ

ఓదెల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత లక్ష్యంగా గంజాయి రవాణా చేస్తున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం ఏసీపీ గజ్జి కృష్ణ వివరాలు వెల్లడించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని సుభాష్‌నగర్‌కు చెందిన కంసాని అరుణ్ కారు డ్రైవర్‌గా, హమాలి కార్మికునిగా, టైల్స్‌వర్కర్‌గా పనిచేస్తున్నాడు. అక్రమమార్గంలో డబ్బు సంపాదనపై దృష్టి పెట్టి గంజాయి తాగడానికి అలవాటు పడ్డాడని తెలిపారు. ఈక్రమంలో కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు చెందిన బొల్లేద్దు మహేందర్, చీమల ఆకాష్‌లతో పరిచయం ఏర్పడింది. ఒడిశా రాష్ట్రంలోని గుర్తుతెలియని వ్యక్తులనుంచి తక్కువధరకు గంజాయిని కొనుగోలు చేసి, కరీంనగర్, గోదావరిఖని, పెద్దపల్లి, సుల్తానాబాద్, ఓదెల ప్రాంతాల్లో కళాశాల విద్యార్థులకు, యువకులను లక్ష్యంగా చేసుకొని కిలో గంజాయి అమ్ముతున్నారని తెలిపారు. ఇల్లందుకు చెందిన మహేందర్, ఆకాష్‌ల వద్ద అరుణ్ గంజాయి కొనుగోలు చేసి కారులో హుస్నాబాద్‌కు చేరుకున్నాడని తెలిపారు. హుస్నాబాద్, పెద్దపల్లి, ఓదెలప్రాంతంలో గంజాయిని విక్రయించి వస్తుండగా పొత్కపల్లి ఫంక్షన్ హాల్ శివారులో పోలీసులు కారును తనిఖీ చేయడంతో డిక్కీలో గంజాయి లభించిందని తెలిపారు. రూ.2.4 లక్షలవిలువచేసే 4.98కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొన్నామన్నారు. అరుణ్ పట్టుబడగా ఇల్లందుకు చెందిన బొల్లెద్దు మహేందర్, చీమల ఆకాష్‌లో పరారీలో ఉన్నారని ఏసీపీ తెలిపారు. గంజాయితో పాటు నిందితుడిని పట్టుకున్న సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై రమేష్, ఏఎస్ఐ రత్నాకర్, కానిస్టేబుళ్లు రాజుయాదవ్, హరీష్, రాము, శివశంకర్, రాజేందర్, రాజు, రమేష్‌లను డీసీపీ అంబర్ కిషోర్ ఝా, ఏసీపీ గజ్జి కృష్ణ అభినందించారు.

క్రిప్టో కరెన్సీలో పెట్టుబడుల పేరిట మోసం

- మాజీ కార్పొరేటర్ కట్ల సతీష్ అరెస్టు
- ఐపాడ్, 2 మొబైల్ ఫోన్‌లు స్వాధీనం



నిందితుడు మాజీకార్పొరేటర్ కట్ల సతీష్‌ను అరెస్టు చూపుతున్న పోలీసు అధికారులు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): క్రిప్టో కరెన్సీలో పెట్టుబడిపెడితే మూడింతల లాభాలు వస్తాయని నమ్మబలికి సామాన్య ప్రజలను మోసం చేస్తున్న కేసులో నిందితుడు మాజీ కార్పొరేటర్ కట్ల సతీష్‌ను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. లోకేష్, సాయి అనే మరోఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. నిందితుడు కట్లసతీష్ వద్ద నుంచి ఒకఐపాడ్, 2 సెల్‌ఫోన్‌లు, ఇతర ఐడీ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం కరీంనగర్ సీసీఎస్ సీఐ ప్రకాశ్‌గౌడ్, రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కరీంనగర్ కోతిరాంపూర్‌కు చెందిన మాజీ కార్పొరేటర్ కట్ల సతీష్ మెటా ఫండ్ క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే మూడింతలు లాభాలు వస్తాయని పట్టణానికి నునావత్ భాస్కర్‌ను నమ్మించాడు.

తనవద్ద డబ్బులు లేవని చెప్పగా బయట 5శాతం వడ్డీకి తీసుకొచ్చి పెట్టుబడి పెడితే తక్కువ సమయంలో 3రెట్లు అవుతాయని నమ్మబలికాడు. దీంతో భాస్కర్ 2024జూన్ 4న సరస్వతి నగర్‌లోని తన ఇంటిలో కట్లసతీష్‌కు 15లక్షల రూపాయలు క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి కింద ముట్టజెప్పాడు. ఆ తరువాత మరి కొందరిని ఈ స్కీంలో చేరిపిస్తే మరిన్ని లాభాలు వస్తాయని చెప్పగా నమ్మిన భాస్కర్ తనకు పరిచయం ఉన్న కళ్లెం పహిపాల్‌రెడ్డి, మహేందర్, అజ్మీర తిరుపతి, బి.చంద్రనాయక్, బాలు నాయక్, బి.చందు, కె.తిరుపతి, బి. మహేష్, మంగీలాల్, అరుణ్, రామచంద్రమూర్తి, జి.రాందాస్, జలపతి, జి ఫకీర్దాస్, ఆర్.వెంకటేశ్వర్‌రావు, వంగల రూప, మోతె కరుణాకర్‌రెడ్డిని అదే నెల 11న భాస్కర్ ఇంట్లో సమావేశపరిచాడు. మూడు నెలల్లో 3 రెట్లు లాభాలు వస్తాయని కట్లసతీష్ వారిని నమ్మించాడు. 17మంది వద్ద మధ్యవర్తి మోతె సాయి ద్వారా కోటి 20 లక్షలు రూపాయలు కట్ల సతీష్ తీసుకున్నాడు. కాని ఇంత వరకు ఎవరికీ డబ్బులు చెల్లించలేదు. కట్ల సతీష్‌ను నమ్మి వడ్డీకి డబ్బులు తెచ్చి ఇచ్చామని, వడ్డీ కట్టలేక చాలా ఇబ్బందులు పడుతున్నామని భాస్కర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

● దర్శించుకున్న సినీ నటుడు చిన్న



సినీ నటుడు చిన్నకు రాజన్న ప్రసాదం అందజేస్తున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి రాజన్నఆలయానికి వచ్చిన భక్తులు శ్రీరాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని తరించారు. రాజన్నకు ఎంతో ఇష్టమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు.

రాజన్న సేవలో సినీ నటుడు చిన్న..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని ప్రముఖ సినీనటుడు చిన్న దర్శించుకున్నారు. శుక్రవారం రాజన్నఆలయానికి విచ్చేసినఆయన శ్రీస్వామి వారి ప్రత్యేకపూజలో పాల్గొన్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

పోక్సో కేసులో పదేళ్ల జైలు శిక్ష

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడికి పదేళ్ళ జైలుశిక్షవిధిస్తూ శుక్రవారం జిల్లాజడ్జి కుంచాల సునీత తీర్పునిచ్చారు. 2017లో జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి పట్టణానికి చెందిన బాలిక పాల ప్యాకెట్ తీసుకొచ్చేందుకు కిరాణ షాపునకు వెళ్ళింది. ఇంటికి తిరిగి వెళ్తుండగా మందల రవి అను వ్యక్తి మోటార్ సైకిల్‌పై వచ్చి బాలికను ఇంటి వద్ద దింపుతానని ద్విచక్రవాహనంపై ఎక్కించుకున్నాడు. పట్టణ శివారుచెట్ల పొదల్లోకి తీసుకెళ్ళి అత్యాచారానికి పాల్పడ్డాడు. కూతురు ఇంటికి రావడం లేదని తల్లి వెతుకుతుండగా బాలిక ఎదురుపడి జరిగిన విషయం తెలిపింది. తల్లి ఫిర్యాదుతో అప్పటిఎస్సై తడవేన శ్రీనివాస్ మందల రవిపై కేసు నమోదు చేశాడు. కోర్టు పీపీ బాదం రమేష్, ఆరెల్లి రాములు సాక్ష్యులను ప్రవేశపెట్టి నేరాన్ని రుజువు చేయడంతో జడ్జి పదేళ్ళ జైలు శిక్ష, పది వేల రూపాయల జరిమానా విధించారు. అలాగే జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ నుంచి బాధితురాలికి 2 లక్షల రూపాయల పరిహారం ఇవ్వాలని తీర్పునిచ్చారు.

శ్రీరాంసాగర్‌కు తగ్గిన వరద



మత్తడి దూకుతున్న ఎగువ మానేరు

జగిత్యాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరదనీరు రావడం శుక్రవారం స్వల్పంగా తగ్గింది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 17,715 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా కాకతీయ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 17,715 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

మళ్లీ ఎగువ మానేరు పరవళ్లు..

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు మళ్లీ పరవళ్ల తొక్కుతోంది. రెండు రోజులుగా ఎగువన కురుస్తున్న వర్షాలకు కామారెడ్డి జిల్లాలోని పల్వంచ వాగు, సిద్దిపేటలోని కూడవెళ్లి వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో ఎగువ మానేరు జలాశయంలోకి వరద నీరు భారీగా వస్తోంది. దీంతో మానేరు మత్తడి దూకుతోంది.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో..

బోయినపల్లి: శ్రీరాజరాజేశ్వర జలాశయానికి (మిడ్‌మానేరు) ప్రాజెక్టు శుక్రవారం 14630 ఇన్‌ఫ్లో కొసాగుతోంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 13000, మానేరు ములవాగు ద్వారా 1630క్యూసెక్కుల నీటిప్రవాహం కొనసాగుతోంది. కాగా దిగువ ఉన్న ఎల్ఎండీ ప్రాజెక్టుకు నాలుగు గేట్ల ద్వారా 6వేల క్యూసెక్కులు, ప్యాకేజీ10 లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400, ప్యాకేజీ9లోని మల్కాపేట రిజర్వాయర్‌కు 600 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318మీటర్లకు ప్రస్తుతం 317.82 ఉండగా, నీటినిలువ సామర్థ్యం 27.55 టీఎంసీలకు 27.093 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు..

ఇల్లంతకుంట : ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి రెండు పంపుల ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.06టీఎంసీలకు చేరుకున్నాయి. మధ్యమానేరు ద్వారా వస్తున్న 6400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 6600క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

రైతు వేదికలో షార్ట్‌సర్క్యూట్

కోనరావుపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం నిజామాబాద్ రైతువేదికలో యూరియా పంపిణీ చేస్తున్న క్రమంలో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. స్విచ్‌బోర్డులో ఒక్కసారిగా మంటలు చెరగడంతో రైతులు, అధికారులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే స్పందించిన అధికారులు, రైతులు మంటలార్పి వేయడంతో ప్రమాదం తప్పింది.



స్విచ్ బోర్డ్ వద్ద మంటలు

ఆర్థిక ఇబ్బందులతో ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య



అనిల్(ఫైల్)

బోయినపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముకుంద అనిల్(22) గతఏడాదిగా కుటుంబసభ్యులకు దూరంగా ఉండి ఒంటరిగా ఉంటూ కిరణంషాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండునెలలుగా అనిల్‌కు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో పాటు ఒంటరితనం భరించలేక శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు తల్లి రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది యువకుడి బలవన్మరణం



శరత్ కుమార్(ఫైల్)

వెల్గటూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తునూర్ గ్రామానికిచెందిన సంగ శరత్ కుమార్(23) అనే యువకుడు శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం మృతుడు శరత్ డిగ్రీచదవడం మధ్యలోనే మానివేసి హార్వెస్టర్ కొనుగోలు చేసి దానిని నడుపుతూ జీవిస్తున్నాడు. కాగా అతను సంవత్సరం నుంచి ఛాతినొప్పితో బాధపడుతున్నాడు. ఆసుపత్రికి వెళ్లినా తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెంది మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు శరత్‌కుమార్ తల్లి రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. కాగా మృతుడు ఆత్మహత్య చేసుకునే ముందు తన స్నేహి తులకు తాను చనిపోతున్నట్లు మెసేజ్ పెట్టినట్లు సమాచారం. కాగా ప్రేమవ్యవహారమే ఆత్మహత్యకు కారణం కావచ్చని స్థానికులు చర్చించుకుంటు న్నారు.

హిమాచల్‌ప్రదేశ్‌లో కొండూరుకు ఘన స్వాగతం

గంభీరావుపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లా విమానాశ్రయంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావుకు ఘన సన్మానం లభించింది. శనివారంలో సిమ్లాలో జరగనున్న జాతీయ సహకార సమావేశానికి (సహకార పునర్జీవం) కొండూరు హాజరుకానున్నారు. సమష్టి సహకార బలం ద్వారా ఐవైసీ-2025 కార్యక్రమం కోసం రవీందర్‌రావు హిమాచల్ ప్రదేశ్‌కు శుక్రవారం బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంక్ కార్యక్రమ ప్రతినిధులు రవీందర్‌రావుకు ఘనంగా స్వాగతం పలికారు.



సిమ్లా విమానాశ్రయంలో కొండూరు రవీందర్‌రావుకు స్వాగతం పలుకుతున్న ప్రతినిధులు

ప్రాణాలకు రక్ష..

● నేడు ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం



సుభాష్‌నగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్నా.. ప్రమాదంలో గాయపడినా వైద్యసహాయం, అంబులెన్స్ వచ్చేవరకు ప్రాణాలను కాపాడటానికి అందించే తక్షణ వైద్య సహాయమే ప్రథమ చికిత్స. సెప్టెంబరు నెలలో రెండవ శనివారం ప్రపంచ ప్రథమచికిత్స దినోత్సవాన్ని జరుపుకుంటారు. ప్రథమచికిత్స అంటే డ్రెస్సింగ్ నుంచి చిన్నవ్యాధుల చికిత్స, సీపీఆర్ (కార్డియాక్ పల్మనరీరెసాసిటేషన్)వరకు ఉంటాయి. ప్రథమచికిత్సకు నిపుణుడు లేదాశిక్షణ పొందిన వ్యక్తిలేదానిర్దిష్ట పరికరాలు, సామగ్రి అవసరం లేదు. అందుబాటులో ఉన్న వనరులతో పరిసరాలను తెలిసిన వ్యక్తికూడా ప్రథమచికిత్స అందించవచ్చు. అధికారిక ప్రథమచికిత్స ఉత్తమమైనప్పటికీ అప్పటివరకు కొన్ని ప్రాథమిక ప్రాణాలను రక్షించే పద్ధతులు, నైపణ్యాలను నేర్చుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది.

● ఎందుకంత ప్రాముఖ్యత..

అత్యసర పరిస్థితుల్లో ప్రతి సెకను విలువైనదే. సకాలంలో అందించే ప్రథమ చికిత్సవ్యక్తి ప్రాణాలను కాపాడుతుంది. అలాంటి పరిస్థితుల్లో ప్రథమచికిత్స కీలకంగా పరిగణించబడుతుంది. ప్రమాదం జరిగిన ప్రదేశం, లేదా గాయపడిన వ్యక్తిఉన్న ప్రదేశంచాలా దూరంలో ఉండవచ్చు. ఆ ప్రదేశం దూరంగా ఉండవచ్చు. నిపుణుడు చేరుకోవడానికి చాలా సమయం పట్టవచ్చు. అలాంటి పరిస్థితుల్లో ప్రథమ చికిత్స అందించి ప్రాణాలను కాపాడుకోవచ్చు.

● నిర్వహించే కార్యక్రమాలు

ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం సందర్భంగా ప్రథమ చికిత్సపై అవగాహన, శిక్షణను ప్రోత్సహించే వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారు. సీపీఆర్ టెక్నిక్‌లు, పేపర్ కట్ ఎలా చేయాలి, బ్యాండేజ్ ఎలా వేయాలి, వంటివి ప్రదర్శనల ద్వారా తెలియచేస్తారు. ప్రథమ చికిత్సను నేర్చుకోవడం వల్ల ఎంత ఉపయోగకరం. కొన్ని సందర్భాల్లో ప్రథమ చికిత్స తెలిసిన వారు చికిత్స అందించడం వల్ల ప్రాణాలను కాపాడివారు అవుతారు.



తొలిరోజు మనదే

● సింగిల్స్‌లో దక్షిణేశ్వర్, సుమిత్ గెలుపు
● భారత్ 2-0 ● స్విట్జర్లాండ్‌తో డేవిస్ కప్

బీల్ (స్విట్జర్లాండ్): డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్-1లో భాగంగా ఆతిథ్య స్విట్జర్లాండ్‌తో పోరులో తొలిరోజు భారత్‌దే పైచేయి అయింది. శుక్రవారం జరిగిన సింగిల్స్, రివర్స్ సింగిల్స్ మ్యాచుల్లో భారత ఆటగాళ్లు గెలవడంతో 2-0 ఆధిక్యం లభించింది. అయితే, ప్రధానంగా తొలిసారి డేవిస్ కప్ ఆడుతున్న తమిళనాడుకు చెందిన దక్షిణేశ్వర్ సురేష్ తనకంటే మెరుగైన ర్యాంకరైన ప్రత్యర్థిని ఓడించడం మొదటిరోజు ఆటలో విశేషం. తొలి సింగిల్స్‌లో 626వ ర్యాంకర్ దక్షిణేశ్వర్ 7-6 (5), 6-3తో 155వ ర్యాంకరైన జెరోమ్ కిమ్‌ను చిత్తు చేసి సంచలనం సృష్టించాడు. అనంతరం జరిగిన రివర్స్ సింగిల్స్‌లో అనుభవజ్ఞుడైన సుమిత్ నగల్ 6-3, 7-6(4)తో మార్క్ అండ్రియా హస్లెర్‌పై గెలిచి భారత్‌కు 2-0 ఆధిక్యాన్ని అందించాడు. ఇక, శనివారం జరిగే డబుల్స్ మ్యాచ్‌లో శ్రీరామ్ బాలాజీ/బొల్లిపల్లి రిత్విక్ చౌదరి జోడీ బరిలోకి దిగనుంది.

స్టార్లతో కళకళ

నేటినుంచి వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్
భారత ఆశలన్నీ నీరజ్‌పైనే



స్టార్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం



నేటి భారత షెడ్యూల్
ఉ. 4 గం.: పురుషుల 35 కి.మీ. రేస్ వాక్-రాంబాబు, సందీప్; మహిళల 35 కి.మీ. రేస్‌వాక్-ప్రియాంక గోస్వామి
సా. 4.30: మహిళల 1500 మీ. హీట్-పూజ

టోక్యో: ఒలింపిక్స్ తర్వాత అథ్లెటిక్స్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైనది ప్రపంచ చాంపియన్‌షిప్స్. విశ్వవ్యాప్త ప్రఖ్యాత అథ్లెట్ల సత్తాకు పరీక్షగా నిలిచే ఈ చాంపియన్‌షిప్స్ శనివారం టోక్యోలో ప్రారంభం కానున్నాయి. ఈనెల 21 వరకు జరిగే పోటీలలో 200 జట్ల నుంచి 2000 మంది అథ్లెట్లు తలపడుతున్నారు. 49 విభాగాలలో మొత్తం 147 పతకాలకోసం హోరాహోరీ పోరు జరగనుంది. షెల్లీ ఆన్ ఫ్రేజర్ ప్రైస్, షకారీ రిచర్డ్‌సన్, నోవా లైల్స్, కిషానే థాంప్సన్, సిడ్నీ మెక్‌లాలిన్, అర్మాండ్ డుప్లాంటిస్, నీరజ్ చోప్రా వంటి మేటి అథ్లెట్లు ఫ్యాన్స్‌ను అలరించనున్నారు.

షెల్లీ ఘనంగా ముగిస్తుందా..?
ఈసారి వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో జమైకా స్ప్రింట్ దిగ్గజం, మహిళల 100 మీ. స్ప్రింట్ రారాణి షెల్లీ ఆన్ ఫ్రేజర్ ప్రైస్‌పై అందరి దృష్టి నిలిచింది. 38 ఏళ్ల స్టార్ ఈ పోటీల తర్వాత ట్రాక్ నుంచి రిటైర్ కానుంది. మూడు ఒలింపిక్, 10 ప్రపంచ చాంపియన్‌షిప్స్ స్వర్ణ పతకాల విజేత షెల్లీ టైటిల్‌తో ఘనమైన వీడ్కోలు తీసుకోవాలని భావిస్తోంది. అలాగే మహిళల 100, 200 మీ.లలో అమెరికన్ క్వీన్ షకారీ రిచర్డ్‌సన్ ప్రధాన ఆకర్షణ కానుంది. గత వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో నెగ్గిన 100 మీ. టైటిల్‌ను నిలబెట్టుకోవాలని రిచర్డ్‌సన్ పట్టుదలగా ఉంది. గాయాలతో సతమతమవుతున్న పురుషుల 100.మీ., 200 మీ.ల డిఫెండింగ్ చాంపియన్ నోవా లైల్స్ (అమెరికా) టైటిళ్లు నిలబెట్టుకుంటాడేమో చూడాలి. సీజన్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న జమైకా స్ప్రింటర్ కిషానే థామ్సన్..నోవాకు గట్టి పోటీ ఇవ్వనున్నాడు. బరిలో దిగిన ప్రతి టోర్నీలో రికార్డులు నమోదు చేస్తున్న పురుషుల పోల్‌వాల్ట్ మొనగాడు అర్మాండ్ డుప్లాంటిస్ టోక్యోలో నెలకొల్పే రికార్డుపై ఉత్కంఠ ఏర్పడింది. ఇంకా భారత స్టార్ నీరజ్ చోప్రా, మహిళల 400 మీ. హర్డిల్స్‌లో ప్రపంచ రికార్డు గ్రహీత సిడ్నీ మెక్‌లాలిన్ (అమెరికా), మహిళల 1500, 5వేల మీ.లలో కిప్‌యేగాన్ (కెన్యా) మెరుపులు చూసి తీరాల్సిందే.

టైటిల్‌పై నీరజ్ గురి
భారత్ ఆశలన్నీ సూపర్ స్టార్ నీరజ్ చోప్రాపైనే నిలిచాయి. 2023 బుడాపెస్ట్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో జావెలిన్ పసిడి పతకంతో చరిత్ర సృష్టించిన నీరజ్.. ఆ టైటిల్‌ను నిలబెట్టుకోడమే ధ్యేయంగా బరిలోకి దిగుతున్నాడు. అయితే పాకిస్థాన్‌కు చెందిన ఒలింపిక్ చాంపియన్ అర్షద్ నదీమ్, చెక్ త్రోయర్ జాకబ్ వాల్డేచ్‌ల నుంచి నీరజ్‌కు తీవ్రమైన పోటీ ఎదురుకానుంది. ఇక..మొత్తం 19 మంది అథ్లెట్ల భారత బృందం టోక్యోలో తలపడుతోంది. కానీ పతక ఆశలు మాత్రం నీరజ్‌పైనే నిలిచాయి. ఈనెల 17న జావెలిన్ ఈవెంట్ మొదలు కానుంది. భారత్ నుంచి అన్నూరాణి (మహిళల జావెలిన్), పారుల్ చౌధరి (3000మీ స్టీపుల్ చేజ్), మురళీ శ్రీశంకర్ (లాంగ్ జంప్), గుల్వీర్ సింగ్ (5000మీ.), ప్రవీణ్ చిత్రవేల్ (ట్రిపుల్ జంప్) కూడా బరిలో ఉన్నారు.

ఫైనల్‌కు జైస్మిన్



సెమీస్‌లో మీనాక్షి ● ప్రపంచ బాక్సింగ్

లివర్‌పూల్ (ఇంగ్లండ్): ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత బాక్సర్ జైస్మిన్ లంబోరియా ఫైనల్ చేరింది. మహిళల 57 కిలోల విభాగం సెమీస్‌లో జైస్మిన్ 5-0తో ఒమైలిన్ అల్కాలా (వెనెజులా)ను చిత్తుచేసి కనీసం రజతం ఖాయం చేసుకుంది. మరో అమ్మాయి మీనాక్షి హుడా సెమీస్ చేరడంతో భారత్ ఖాతాలో మరో పతకం ఖరారైంది. 48 కిలోల విభాగం క్వార్టర్‌ఫైనల్లో మీనాక్షి 5-0తో అలైస్ పుంప్రే (ఇంగ్లండ్)ను ఓడించింది. ఇక..పురుషుల విభాగంలో భారత్ పోరు ముగిసింది. బరిలో మిగిలిన జాదుమని సింగ్ 50 కిలోల కేటగిరీ క్వార్టర్‌ఫైనల్లో సాంర్ఖుర్ (కజకిస్థాన్) చేతిలో 0-4తో పరాజయం పాలయ్యాడు.

పాక్ శుభారంభం

ఒమన్‌పై ఘనవిజయం

ఆసియా కప్‌లో నేడు
బంగ్లాదేశ్ x శ్రీలంక
రాత్రి 8 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..



దుబాయ్: భారత్‌తో మ్యాచ్‌కు ముందు పాకిస్థాన్ జట్టు కూడా ఆత్మవిశ్వాసాన్ని పెంచుకుంది. ఆసియా కప్‌లో భాగంగా శుక్రవారం గ్రూప్ 'ఎ'లో ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో 93 పరుగుల తేడాతో నెగ్గింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' మహ్మద్ హారీస్ (43 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 66) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాక్ ఆరంభంలో తడబడినా.. చివరకు 20 ఓవర్లలో 7 వికెట్లకు 160 పరుగులు సాధించింది. ఓపెనర్ సహిబ్జాద ఫర్హాన్ (29), ఫఖర్ జమాన్ (23 నాటౌట్), మహ్మద్ నవాజ్ (19) ఫర్వాలేదనిపించారు. పేసర్ షా ఫైజల్, స్పిన్నర్ ఆమిర్ కలీమ్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో పాక్ బౌలర్ల ధాటికి ఒమన్ బ్యాటర్లు తేలిపోయారు. దీంతో ఆ జట్టు 16.4 ఓవర్లలో 67 పరుగులే చేసి చిత్తుగా ఓడింది. 10 పరుగుల వ్యవధిలోనే ఏడు వికెట్లు కోల్పోవడం గమనార్హం. హమ్మద్ మీర్జా (27) ఒక్కడే కాస్త పోరాడాడు. స్పిన్నర్లు సుఫియాన్, సయీమ్ అయూబ్‌లతో పాటు పేసర్ ఫహీమ్‌లకు రెండేసి వికెట్లు లభించాయి.

సంక్షిప్త స్కోర్లు
పాకిస్థాన్: 20 ఓవర్లలో 160/7 (మహ్మద్ హారీస్ 66, ఫర్హాన్ 29, ఫఖర్ 23; కలీమ్ 3/31, ఫైజల్ 3/34).
ఒమన్: 16.4 ఓవర్లలో 67 ఆలౌట్. (హమ్మద్ 27; ఫహీమ్ 2/6, సుఫియాన్ 2/7, సయీమ్ అయూబ్ 2/8).

సెమీస్‌లో సాత్విక్ జోడీ

● లక్ష్యసేన్ కూడా..
● హాంకాంగ్ ఓపెన్



హాంకాంగ్: భారత షట్లర్లు లక్ష్యసేన్, సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి హాంకాంగ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టైటిల్ దిశగా దూసుకెళ్తున్నారు. సింగిల్స్‌లో లక్ష్యసేన్, డబుల్స్‌లో సాత్విక్ ద్వయం సెమీఫైనల్లో ప్రవేశించారు. ఇద్దరు భారత ఆటగాళ్ల మధ్య జరిగిన సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో లక్ష్య 21-16, 17-21, 21-13తో ఆయుష్ షెట్టిపై గెలుపొందాడు. గత మ్యాచ్‌లో 2024 ప్రపంచ చాంపియన్‌షిప్ రన్నరప్ కొడాయి నరౌకాకి షాకిచ్చి సంచలనం సృష్టించిన ఆయుష్.. లక్ష్యతో పోరులో మాత్రం తడబడ్డాడు. అయితే ఓడినా.. ఆయుష్ గెలుపు కోసం చివరిదాకా పోరాడిన తీరు ఆకట్టుకుంది. గంటా ఆరు నిమిషాల పాటు సాగిన హోరాహోరీ పోరులో తొలి గేమ్ ఓడినా, రెండో గేమ్‌లో లక్ష్యపై పైచేయి సాధించి మ్యాచ్ గెలిచేలా కనిపించాడు. కానీ, నిర్ణాయక మూడో గేమ్ ఆఖర్లో పలుమార్లు ఔట్ షాట్‌లు కొట్టి మ్యాచ్‌ను చేజార్చుకున్నాడు. ఫైనల్ బెర్త్ కోసం తైవాన్ షట్లర్, మూడో సీడ్ చో తిన్ చెన్‌తో లక్ష్య అమీతుమీ తేల్చుకోనున్నాడు. పురుషుల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్స్‌లో 8వ సీడ్ సాత్విక్/చిరాగ్ జంట 21-14, 20-22, 21-16తో మలేసియా జోడీ ఆరిఫ్ జునైది/రాయ్ కింగ్ యాప్‌ను ఓడించింది. ఇటీవలే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో సత్తా చాటిన సాత్విక్ ద్వయం సెమీఫైనల్లో తైవాన్ జోడీ చెన్ చెంగ్ కాన్/లిన్ బింగ్ వీతో తలపడనుంది.

గాథ పోరు ముగిసె..

● నెంబర్‌వన్ చేతిలో ఓటమి
● ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్స్

గ్వాంగ్జు (దక్షిణ కొరియా): ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్స్ రికర్వ్ విభాగంలో భారత్‌కు ఈసారీ నిరాశ తప్పలేదు. మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ప్రీక్వార్టర్స్ చేరి టైటిల్‌పై ఆశలు రేపిన 15 ఏళ్ల గాథ ఖడాకే పోరాటం ముగిసింది. ప్రపంచ నెంబర్‌వన్, పారిస్ ఒలింపిక్స్‌లో మూడు స్వర్ణాల విజేత లిమ్ షియోన్ (కొరియా)తో జరిగిన పోరులో గాథ 0-6తో ఓటమిపాలైంది. ప్రపంచ చాంపియన్‌షిప్స్ రికర్వ్ విభాగంలో భారత్ చివరిసారిగా 2019లో పురుషుల జట్టు రజతం నెగ్గింది. కాగా, ఈసారి టోర్నీలో కాంపౌండ్ ఈవెంట్‌లో పురుషుల జట్టు స్వర్ణం, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో జ్యోతి సురేఖ/రిషభ్ జోడీ రజతం నెగ్గిన సంగతి తెలిసిందే.

యష్, రజత్ శతకాలు

● సెంట్రల్ జోన్ 384/5 ● 'సౌత్'తో దులీప్ ట్రోఫీ ఫైనల్

బెంగళూరు: దులీప్ ట్రోఫీ ఫైనల్లో సెంట్రల్ జోన్ రెండో రోజే పట్టు బిగించింది. యష్ రాథోడ్ (137 బ్యాటింగ్), కెప్టెన్ రజత్ పటీదార్ (101) శతకాల సహాయంతో.. శుక్రవారం ఆట ముగిసే సమయానికి సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 384/5 స్కోరు సాధించింది. ప్రస్తుతం జట్టు 235 పరుగుల భారీ ఆధిక్యంలో నిలిచింది. ఓపెనర్ మలేవర్ (53) హాఫ్ సెంచరీ చేయగా, క్రీజులో యష్‌తో పాటు సారాంశ్ (47 బ్యాటింగ్) ఉన్నాడు. లెఫ్టామ్ పేసర్ గుర్జపనీత్‌కు మూడు వికెట్లు దక్కాయి. సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులకు కుప్పకూలిన విషయం తెలిసిందే.

బెంగళూరు హ్యాట్రిక్

జైపూర్: ప్రొ. కబడ్డీ లీగ్‌లో బెంగళూరు బుల్స్ జోరు ప్రదర్శిస్తూ వరుసగా మూడో విజయం సాధించింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో 28-23తో జైపూర్ పింక్ పాంథర్స్‌ను ఓడించింది. దీపక్ శంకర్ మరో 'హై ఫైవ్'తో అదరగొట్టగా, రైడర్ అలీరెజా 8 పాయింట్లతో సత్తా చాటాడు. జైపూర్‌లో నితిన్ కుమార్ (8) ఒక్కడే రాణించాడు. మరో మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 46-36తో బెంగాల్ వారియర్స్‌ను చిత్తు చేసింది.

ఇక దయచేయండి!



విరుష్కతో కివీస్ హోటల్ సిబ్బంది

న్యూఢిల్లీ: విరాట్ కోహ్లీ, అనుష్క జోడీని వెళ్లిపోవాలని న్యూజిలాండ్‌లోని ఓ హోటల్ సిబ్బంది కోరిన ఉదంతాన్ని టీమిండియా బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ వెల్లడించింది. గతంలో భారత పురుషులు, మహిళల జట్లు ఒకే సమయంలో కివీస్‌లో పర్యటించాయి. ఇరు జట్లూ ఒకే హోటల్‌లో బస చేశాయి. ఈక్రమంలో బ్యాటింగ్‌కు సంబంధించి సలహాలు ఇవ్వాలని స్మృతి మంధాన, జెమీమా..విరాట్‌ను కోరారు. దాంతో అదే హోటల్‌లోని కేఫ్‌కు రావాలని విరాట్ వారికి సూచించాడు. అప్పటికే కోహ్లీ, అనుష్క జోడీ అక్కడ ఉంది. దాదాపు నాలుగు గంటలపాటు విరాట్, మంధాన, జెమీమాతోపాటు అనుష్క మాట్లాడుకున్నారట. తొలి అరగంట క్రికెట్ విషయాలపై చర్చించగా.. ఆపై సాధారణ జీవితానికి సంబంధించిన మాటల్లోకి జారుకున్నట్టు జెమీమా వెల్లడించింది. అప్పటికే రాత్రి 11.30 కావడంతో కేఫ్ సిబ్బంది వచ్చి విరాట్, అనుష్కను అక్కడ నుంచి వెళ్లిపోవాలని సూచించినట్టు రోడ్రిగ్స్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది.

ఐపీఓ మార్కెట్లో సంస్కరణలు

● కనీస పబ్లిక్ షేర్ హోల్డింగ్‌పై కంపెనీలకు ఊరట
● 10 ఏళ్ల వరకు గడువు పెంపు
● సెబీ చైర్మన్ పాండే



ఇతర ప్రధాన నిర్ణయాలు
- రూ.250 కోట్లకు మించిన ఐపీఓల్లో యాంకర్ ఇన్వెస్టర్ల వాటా 10% నుంచి 15 శాతానికి పెంపు
- రూ.250 కోట్ల కంటే తక్కువ ఉండే ఐపీఓల్లో మదుపు చేసే యాంకర్ ఇన్వెస్టర్ల సంఖ్య 5 నుంచి 15 మధ్య ఉండాలి
- నియమిత మదుపరులకు సేవలు అందించే ఏఐఎఫ్‌లకు ఊరట
- రీట్స్, ఇన్విట్స్.. ఈక్విటీ పెట్టుబడులుగా వర్గీకరణ
- ప్రతి స్టాక్ ఎక్స్ఛేంజీలో ఇద్దరు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల నియామకం

ముంబై : దేశ క్యాపిటల్ మార్కెట్లో మరిన్ని సంస్కరణలకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ శ్రీకారం చుట్టింది. శుక్రవారం చైర్మన్ తుహిన్ కాంత పాండే అధ్యక్షతన జరిగిన బోర్డు సమావేశంలో సెబీ దీనికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా పెద్దమొత్తంలో మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉన్న కంపెనీలకు పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)ల జారీలో మరింత వెసులుబాటు కల్పించాలని సెబీ నిర్ణయించింది. రూ.50,000 కోట్ల నుంచి రూ.లక్ష కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉన్న కంపెనీలు తమ ఈక్విటీలో 25 శాతం కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ (ఎంపీఎస్) కలిగి ఉండాలన్న గడువును ప్రస్తుత మూడేళ్ల నుంచి ఐదేళ్లకు పొడిగించారు. కంపెనీలు ఈ మొత్తాన్ని ఒకేసారి కాకుండా ముందు కనీసం 8 శాతం ఈక్విటీ షేర్లను జారీ చేసి, ఆ తర్వాత మిగతా 17 శాతం ఈక్విటీ షేర్లను దశలవారీగా ఐపీఓల ద్వారా విక్రయించేందుకు అనుమతిస్తారు. రూ.లక్ష కోట్ల నుంచి రూ.5 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్ ఉన్న కంపెనీలు ఐదేళ్లలో జారీ చేయాల్సిన ఎంపీఎస్ ఈక్విటీ షేర్ల పరిమితినీ సెబీ సవరించింది. ప్రస్తుతం ఈ కంపెనీలు ఇందుకోసం ముందుగా 5 శాతం ఈక్విటీని ఎంపీఎస్‌గా జారీ చేయాలి. దీన్ని 2.75 శాతానికి కుదించాలని సెబీ నిర్ణయించింది. ఇక రూ.5 లక్షల కోట్ల కంటే ఎక్కువ మార్కెట్ క్యాప్ ఉన్న కంపెనీలు 25 శాతం ఎంపీఎస్‌కి చేరాల్సిన గడువునీ ప్రస్తుత ఐదేళ్ల నుంచి పదేళ్లకు పెంచారు. ఇందుకోసం ఈ కంపెనీలు ముందు తమ ఈక్విటీలో 2.5 శాతం షేర్లను ఐపీఓ ద్వారా జారీ చేస్తే సరిపోతుంది. మిగతా 22.5 శాతం ఈక్విటీ షేర్లను మార్కెట్ పరిస్థితులను బట్టి పదేళ్లలో జారీ చేస్తే సరిపోతుంది.

పెద్ద కంపెనీలకు ఊరట: సెబీ తాజా నిర్ణయం త్వరలో పబ్లిక్ ఇష్యూకి వచ్చే రిలయన్స్ జియో, ఎన్ఎస్ఈలకు మేలు చేస్తుందని భావిస్తున్నారు. సెబీ నిబంధనలకు అనుగుణంగా ఒకేసారి పెద్ద మొత్తంలో ఐపీఓలు జారీ చేస్తే.. ఆ ఇష్యూలను భరించే శక్తి మార్కెట్‌కు లేకపోవడంతో పాటు సెకండరీ మార్కెట్ కూడా తీవ్ర ఆటుపోట్లకు లోనవుతోంది. నిర్దిష్ట గడువులోనే దశల వారీగా ఈ వాటా విక్రయించేందుకు అనుమతించాలని కంపెనీలు ఎప్పటి నుంచో కోరుతున్నాయి. సెబీ ఎట్టకేలకు శుక్రవారం దీనికి ఆమోదం తెలిపింది.

రిటైల్ మదుపరులకు ఊరట: ప్రస్తుతం రూ.5,000 కోట్లకు మించిన ఐపీఓ ఇష్యూల్లో రూ.2 లక్షల లోపు పెట్టుబడితో దరఖాస్తు చేసే రిటైల్ మదుపరులకు 35 శాతం షేర్లు కేటాయిస్తున్నారు. దీన్ని 25 శాతానికి కుదించాలని సంస్థాగత మదుపరుల నుంచి ఒత్తిడి వచ్చింది. అయినా ఈ వాటాను యథాతథంగా 35 శాతం వద్దే కొనసాగించాలని నిర్ణయించినట్టు సెబీ చైర్మన్ పాండే చెప్పారు. క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ బయ్యర్స్ (క్యూఐబీ)కు కేటాయించే 50 శాతం వాటానూ అలాగే కొనసాగించాలని సెబీ నిర్ణయించింది.

ఎఫ్‌పీఐల పెట్టుబడులకు సింగిల్ విండో: భారత స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టే విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ)కు సింగిల్ విండో విధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. దీని ద్వారా తక్కువ రిస్క్ కలిగిన ఎఫ్‌పీఐల పెట్టుబడులను ఆకర్షించవచ్చని భావిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా సింగిల్ విండో ఆటోమేటిక్ అండ్ జనరలైజ్డ్ యాక్సెస్ ఫర్ ట్రస్టెడ్ ఫారిన్ ఇన్వెస్టర్స్ (స్వాగత్-ఎఫ్ఐ) పేరుతో కొత్త ముసాయిదాను రూపొందించింది. కాగా దేశంలో ప్రతి నెలా 100 ఎఫ్‌పీఐలు నమోదవుతూ వస్తున్నాయని సెబీ తెలిపింది. ఏడాది క్రితం 10,500 ఎఫ్‌పీఐలు నమోదై ఉండగా ప్రస్తుతం ఈ సంఖ్య 12,000 దాటిందని పేర్కొంది.

బిజినెస్

అపోలో హాస్పిటల్స్ చేతికి అపోలో హెల్త్

● ఐఎఫ్‌సీ నుంచి 31 శాతం వాటా కొనుగోలు
● డీల్ విలువ రూ.1,254 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అపోలో హెల్త్ అండ్ లైఫ్‌స్టైల్ లిమిటెడ్ (ఏహెచ్ఎల్ఎల్) పూర్తి స్థాయిలో అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏహెచ్ఈఎల్) అనుబంధ సంస్థ కానుంది. ఇందుకోసం ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) చేతిలో ఉన్న 31 శాతం వాటాను ఏహెచ్ఈఎల్ రూ.1,254.07 కోట్లకు కొనుగోలు చేయనుంది. శుక్రవారం జరిగిన సమావేశంలో ఏహెచ్ఈఎల్ డైరెక్టర్ల బోర్డు ఈ షేర్ల కొనుగోలు ఒప్పందానికి ఆమోదం తెలిపింది. దీంతో ఏహెచ్ఎల్ఎల్ ఈక్విటీలో ఏహెచ్ఈఎల్ వాటా 99.42 శాతానికి చేరుతుంది. మిగతా 0.58 శాతం షేర్లు ఈ-సాప్స్ కింద ఉద్యోగుల వద్ద ఉంటాయి. ఏహెచ్ఎల్ఎల్ కార్యకలాపాలపై పూర్తి నియంత్రణ, యాజమాన్యం కోసం ఐఎఫ్‌సీ నుంచి ఈ వాటాలను కొనుగోలు చేస్తున్నట్టు ఏహెచ్ఈఎల్ రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. దీనివల్ల ఏహెచ్ఎల్ఎల్ నిర్వహణ సామర్థ్యం మరింత మెరుగుపడడంతో పాటు, ఆ సంస్థ వ్యాధి నిర్ధారణ సేవలను ఏహెచ్ఈఎల్‌తో పూర్తి స్థాయిలో అనుసంధానించేందుకు వీలవుతుందని పేర్కొంది. ఈ చర్య అపోలో గ్రూప్ సమగ్ర ఆరోగ్య సేవలకు మరింత విలువ జోడిస్తుందని అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ సునీతా రెడ్డి తెలిపారు. ఏహెచ్ఎల్ఎల్‌పై పూర్తి పట్టు ద్వారా ఆ కంపెనీకి చెందిన ప్రాథమిక ఆరోగ్య, వ్యాధి నిర్ధారణ సేవలు, మహిళల ఆరోగ్యం, డెంటల్, డయాలసిస్, అంబులెన్స్ సేవలను మరింత ముందుకు తీసుకు వెళతామని ఏహెచ్ఈఎల్ జాయింట్ ఎండీ సంగీతా రెడ్డి తెలిపారు.

గురుగ్రామ్‌లో క్యాన్సర్ కేర్ సెంటర్: గురుగ్రామ్‌లో రూ.573 కోట్ల పెట్టుబడితో అదనంగా సమగ్ర క్యాన్సర్ కేర్ సెంటర్ ఏర్పాటు చేసేందుకూ ఏహెచ్ఈఎల్ బోర్డు ఆమోదం తెలిపింది. ఈ కేంద్రం ద్వారా ఏటా అదనంగా 350 రోగులకు వైద్య సేవలు అందించవచ్చు. 2029 మార్చి నాటికి ఈ కేంద్రం ఏర్పాటు పూర్తవుతుంది.

మళ్లీ ధరలు సుర్..

ఆగస్టు ద్రవ్యోల్బణం 2.07%

న్యూఢిల్లీ: ద్రవ్యోల్బణం మరోసారి ఊర్ధ్వముఖ చలనం ప్రారంభించింది. కూరగాయలు, మాంసం, చేపలు, గుడ్ల ధరలు పెరగడంతో ఆగస్టు నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 2.07 శాతానికి చేరింది. ద్రవ్యోల్బణం జూలైలో 1.61%, గత ఏడాది ఆగస్టులో (-) 0.69% ఉంది. 9 నెలల పాటు వరుసగా తగ్గుతూ వచ్చిన వినియోగదారుల ధరల సూచీ ఆగస్టులో తొలిసారి ఎగువకు కదిలింది. అయితే ఆర్‌బీఐకి ప్రభుత్వం నిర్దేశించిన కట్టడి పరిధి 4% (2 శాతం ఎగువకు లేదా దిగువకు సర్దుబాటుతో)లోపే ఉంది. ఆగస్టు నెలలో ద్రవ్యోల్బణం గ్రామీణ ప్రాంతాల్లో 1.18% నుంచి 1.69 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 2.1% నుంచి 2.47 శాతానికి పెరిగింది. రాష్ట్రాల వారీగా చూస్తే కేరళలో గరిష్ఠంగా9.04% ఉండగా అసోమ్‌లో కనిష్ఠంగా -0.66% ఉంది. ఆహార, ఇంధన విభాగాలు మినహా ఇతర విభాగాల్లో ద్రవ్యోల్బణం 4.3 శాతంగా ఉంది.

మార్కెట్లలో కొనసాగిన ర్యాలీ

ఇటు ఈక్విటీలు, అటు బులియన్ పరుగులు

ముంబై: అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న ఆశలతో పాటు ఇన్ఫోసిస్ ప్రకటించిన భారీ బైబ్యాక్ ఉత్తేజంతో శుక్రవారం కూడా ఈక్విటీ మార్కెట్లో ర్యాలీ కొనసాగింది. వరుసగా సెన్సెక్స్ ఐదో రోజు, నిఫ్టీ ఎనిమిదో రోజు లాభాల్లో ముగిశాయి. ఇంట్రాడేలో 444.12 పాయింట్లు లాభంతో 81,992.85 పాయింట్లను తాకిన సెన్సెక్స్ చివరికి 355.97 పాయింట్ల లాభంతో 81,904.70 వద్ద ముగిసింది. నిఫ్టీ 108.50 పాయింట్ల లాభంతో 25,114 వద్ద ముగిసింది. వారం మొత్తంలో సెన్సెక్స్ 1193.94 పాయింట్లు, నిఫ్టీ 373 పాయింట్లు లాభపడ్డాయి. వరుసగా 8 సెషన్లలో నిఫ్టీ 534 పాయింట్లు లాభపడింది.

బంగారం, వెండి భగభగ

బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరల ర్యాలీ కూడా అప్రతిహతంగా కొనసాగుతోంది. ఢిల్లీ మార్కెట్లో 99.9% స్వచ్ఛత గల 10 గ్రాముల బంగారం ధర రూ.700 పెరిగి మరో జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.1,13,800 వద్ద ముగిసింది. 99.5% స్వచ్ఛత గల బంగారం ధర సైతం రూ.700 పెరిగి రూ.1,13,300 వద్ద స్థిరపడింది. రెండు రోజుల నష్టాలకు తెర దించిన వెండి ధర బలమైన పునరుజ్జీవం సాధించింది. కిలో వెండి రూ.4,000 పెరిగి జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.1,32,000 వద్ద స్థిరపడింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)




13వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	550
వరంగల్	537	గోదావరి	545
చిత్తూరు	563	విశాఖపట్నం	555
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	121	విజయవాడ	140
వరంగల్	121	గుంటూరు	132
కరీంనగర్	121	ఒంగోలు	132
మహబూబ్‌నగర్	121	చిత్తూరు	118
కర్నూలు	121	నెల్లూరు	123
విశాఖపట్నం	144	అనంతపురం	123
గోదావరి	140		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,11,280 ▲	1,02,000 ▲	1,41,000 ▲
విజయవాడ	1,13,150 ▲	1,07,000 ▲	1,31,800 ▲
విశాఖపట్నం	1,13,040 ▲	1,00,540 ▼	1,42,000 ▲
రాజమండ్రి	1,11,270 ▲	1,02,000 ▲	1,28,300 ▲
ప్రొద్దుటూరు	1,13,200 ▼	1,04,140 ▼	1,31,600 ▲
ముంబై	1,09,707 ▲	1,00,492 ▲	1,28,008 ▲

● ఐటీసీ ఆశీర్వాద్ మసాలా..నేచురల్ స్టార్ నానితో 'దమ్ము మీదే.. స్టార్ మీరే' ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఆంధ్ర, తెలంగాణ వాసుల అభిరుచులకు అనుగుణంగా దమ్దార్ ఫుడ్, సినిమా పేరుతో ఈ క్యాంపెయిన్‌ను మహిళల కోసం ప్రత్యేకంగా రూపొందించింది. ఇందులో భాగంగా వంటల పోటీలో గెలిచిన మహిళలతో నాని సినిమా థియేటర్ ప్రకటనలో కనిపించనున్నారు.

● హెల్త్‌కేర్ టెక్నాలజీ సంస్థ ఫుజిఫిల్మ్ ఇండియా.. నిజామాబాద్‌లో తన అడ్వాన్స్‌డ్ ఏఎంయుఎల్ఈటీ ఇన్నోవాలిటీ ఫుల్ ఫీల్డ్ డిజిటల్ మమ్మోగ్రఫీ (ఎఫ్ఎఫ్‌డీఎం) సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. విశ్వమ్ డయాగ్నోస్టిక్స్ సెంటర్‌లో ఈ సిస్టమ్‌ను ఏర్పాటు చేసింది. బ్రెస్ట్ క్యాన్సర్ డయాగ్నోసిస్‌లో ఈ మమ్మోగ్రఫీ కీలకంగా ఉండనుంది.

● టాటా ఈవీ.. మార్కెట్లోకి సరికొత్త నెక్సాన్ ఈవీ విడుదల చేసింది. ఏడీఏఎస్ సేఫ్టీ టెక్‌తో దీన్ని తీసుకువచ్చింది. దీంతో పాటు కొన్ని కొత్త ఫీచర్లను పొందుపరిచింది. ఎంపవర్డ్ ప్లస్ ఏ45, ఏ45 డార్క్, ఏ 45 రెడ్ డార్క్ వేరియంట్లలో అందుబాటులో ఉండనున్న ఈ నెక్సాన్ ఈవీ ధరలు వరుసగా రూ.17.29 లక్షలు, రూ.17.49 లక్షలు, రూ.17.49 లక్షలు (ఎక్స్‌షోరూమ్)గా ఉన్నాయి.

హైదరాబాద్ మార్కెట్లోకి విన్‌ఫాస్ట్

వీఎఫ్6, వీఎఫ్7 ఎలక్ట్రిక్ కార్లు విడుదల



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వియత్నాం కేంద్రంగా ఉన్న విన్‌గ్రూప్ జేఎస్‌సీ ఎలక్ట్రిక్ వాహన సంస్థ విన్‌ఫాస్ట్ ఇండియా.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలోకి అడుగు పెట్టింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో తొలి షోరూమ్‌ను ప్రారంభించింది. శుక్రవారం నాడిక్కడ కంపెనీ డిప్యూటీ సీఈఓ అరుణోదయ్ దాస్.. గచ్చిబౌలి, బేగంపేటల్లో నానేష్ ఆటోమోటివ్స్ ఏర్పాటు చేసిన షోరూమ్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మార్కెట్లోకి విన్‌ఫాస్ట్ ప్రీమియం ఎలక్ట్రిక్ కార్లు వీఎఫ్6, వీఎఫ్7 విడుదల చేశారు. వినియోగదారుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని 10 ఏళ్ల బ్యాటరీ వారంటీతో ఈ కార్లను తీసుకు వచ్చినట్లు ఆయన చెప్పారు. కాగా, వీఎఫ్6 ప్రారంభ ధర రూ.16.49 లక్షలు, వీఎఫ్7 ప్రారంభ ధర రూ.20.89 (ఎక్స్‌షోరూమ్)గా నిర్ణయించినట్లు దాస్ తెలిపారు. ఈ ఏడాది చివరి నాటికి దేశవ్యాప్తంగా 27కి పైగా నగరాల్లో 35 డీలర్‌షిప్స్, 26 వర్క్‌షాప్స్‌ను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా హైదరాబాద్ మార్కెట్లో ఇప్పటికే 150కి పైగా కార్లకు బుకింగ్స్ వచ్చాయని, ఈ నెల 22 నుంచి వీటి డెలివరీలను ప్రారంభించనున్నట్లు నానేష్ ఆటో డైరెక్టర్ అక్షయ్ జైన్ తెలిపారు.

ప్రధానమంత్రి విశ్వకర్మ కిట్ల పంపిణీ

రాయికల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ కిట్లను రాయికల్ తపాలా కార్యాలయంలో శుక్రవారం సబ్ పోస్ట్‌మాస్టర్ రాజు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మల్లారెడ్డి, పోస్ట్‌మెన్ మధు, బీజేపీ ప్రధాన కార్యదర్శి కునారపు భూమేష్, ఉపాధ్యక్షులు కడార్ల శ్రీనివాస్, బొడుగం శ్రీకాంత్ రెడ్డి, సుంటిగీకర్ రాము, అందె శంకర్, చింతల అజయ్, గట్టుపెల్లి రవి పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

భీమారం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగోజీపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు పుప్పాల ఈశ్వరయ్య జిల్లాస్థాయి ఉత్తమ ఉద్యోగి అవార్డు వచ్చిన సందర్భంగా భీమారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి శుక్రవారం ఘనంగా సన్మానించారు. బందెల గంగాధర్, మాజీ సర్పంచ్ బాలసాని లహరిక, జాల మనోజ్, సుమలత రవి, ఎండీ సయ్యద్, హరీష్, అరుణ్, అజయ్, ప్రేమ్, అనిల్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

భీమారం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ మజీ వైస్ చైర్మన్ వొద్దినేని హరిచరణ్ రావు ఆధ్వర్యంలో తన తండ్రి సురేందర్‌రావు జ్ఞాపకార్థం నిర్వహించనున్న ఉచిత నేత్ర వైద్యశిబిరం పోస్టర్‌ను శుక్రవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. సోమవారం ఉదయం 9 గంటలకు ఉచిత నేత్ర వైద్య శిబిరం ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ముగిసిన మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు






బీర్‌పూర్‌లో పథకాలు సాధించిన విద్యార్థులతో ఎంఈవో నాగభూషణం, కోరుట్లలో మండల విద్యాధికారి నరేశం, వెల్లుల్లలో ఎంఈవో చంద్రశేఖర్ తదితరులు

రాయికల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా భూపతిపూర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండలస్థాయి పాఠశాలల క్రీడలు శుక్రవారం ముగిశాయి. అండర్-14, అండర్-17 బాల, బాలికల కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు ఎంఈవో రాఘవులు బహుమతులను ప్రదానం చేశారు. పట్టణంలోని విజ్డమ్, వివేకవర్ధిని, గ్రీన్‌వుడ్, కృష్ణవేణి, విశ్వశాంతి, శ్రీచక్ర పాఠశాలలు స్పాన్సర్లుగా వ్యవహరించాయి. కార్యక్రంలో భూపతిపూర్ పాఠశాల హెచ్‌ఎం రమణి, ఎస్‌జీఎఫ్ మండల కన్వీనర్ కృష్ణప్రసాద్, ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు రాజిరెడ్డి, సత్యంగౌడ్, రాజేష్, పీడీలు, పీఈటీలు రాజగోపాల్, గంగాధర్, సుజాత, రమేష్, కిషోర్, గంగాధర్, ప్రతాప్, రాజ్‌కుమార్, సుప్రియ, రవీష్, సత్య తదితరులు పాల్గొన్నారు.

బీర్‌పూర్: బీర్‌పూర్ మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఎస్‌జీఎఫ్ క్రీడలు శుక్రవారంతో ముగియగా విజేతలకు ఎంఈవో నాగభూషణం బహుమతులు అందించారు. కార్యక్రమంలో బీర్‌పూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, సత్యరాజ్, వేణు, ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్స్ రమణ, మారుతి, కిరణ్, పీడీలు లక్ష్మణ్, మంజుల ధరణి పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన క్రీడాపోటీల్లో విజేతలకు ఎంఈవో నరేశం బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నల్ల భూమయ్య, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి అశోక్, ట్రస్మా కోరుట్ల అధ్యక్షుడు ఎండీ బారీ, పీఈటీలు విజయ్, మహిపాల్, గీత, శ్రీకాంత్, శ్రీలత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన క్రీడల్లో విజేతలుగా నిలిచిన వారికి తహసీల్దార్ వరప్రసాద్ బహుమతులను అందజేశారు. మండల విద్యాధికారి మధు, ఉపాధ్యాయులు, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: మండలంలోని వెల్లుల్లలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు ఎంఈవో చంద్రశేఖర్ మెడల్స్ అందజేశారు. ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, నాంపల్లి మారుతీ, ఎస్‌జీఎఫ్ మండల కన్వీనర్ కొమురయ్య, నిర్వాహకులు, పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

పెగడపల్లి: క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని ప్రతీ విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో ప్రావీణ్యం సాధించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పెగడపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండలస్థాయి పాఠశాలల క్రీడాపోటీలను ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. మండల విద్యాధికారి సులోచన, ఫిజికల్ డైరెక్టర్ రమేష్, ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.



పెగడపల్లిలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి

నిరుపేదలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

- కోరుట్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు

కోరుట్ల రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం నిలుస్తుందని కోరుట్ల కాంగ్రెస్ పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. శుక్రవారం మండలంలోని సర్వరాజపూర్‌ను ప్రభుత్వం పైలెట్ గ్రామంగా ఎంపిక చేసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టిందన్నారు. లబ్ధిదారులు భూమి విజయ, పెంట లక్ష్మి, పెద్ది గంగు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయగా గృహ ప్రవేశానికి స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్, కరీంనగర్ ఉమ్మడి జిల్లా మార్కెట్ కమిటీ ఫోరం అధ్యక్షుడు పన్నాల అంజిరెడ్డి మాజీ జడ్పీటీసీ తోట గంగాధర్, మాజీ ఎంపీటీసీ సభ్యులు కృష్ణారెడ్డి, లత-రమేష్, నాయకులు మహిపాల్‌రెడ్డి, కొంతం రాజం, సత్యనారాయణగౌడ్, లింబాద్రి, గంగాధర్‌గౌడ్, పడాల లచ్చయ్య పాల్గొన్నారు.



కోరుట్లలో జువ్వాడి నర్సింగరావును సన్మానిస్తున్న ముస్లింలు

కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వం విద్యా వైద్యంపై ప్రత్యేక దృష్టిసారిస్తోందని కోరుట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని కాగజ్‌పుర కాలనీలోని ఉర్దూ మీడియం పాఠశాలలో రూ. 40 లక్షల నిధులతో నిర్మించే అదనపు తరగతి గదులతో పాటు టాయిలెట్ రూంల నిర్మాణాలను స్థానిక నాయకులతో కలిసి పనులను ప్రారంభించారు. పనులను ప్రారంభించడానికి వచ్చిన జువ్వాడి నర్సిగ రావుతో పాటు స్థానిక నాయకులను కాలనీ వాసులు సన్మానించారు. కోరుట్ల పట్టణానికి రాష్ట్ర ప్రభుత్వం 502 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేసిన వారికి రూ. 10,000 బహుమతి అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అన్నం అనిల్ కుమార్, తిరుమల గంగాధర్, సోగ్రమీ, అడెపు మధు, పుప్పాల ప్రభాకర్, భూమయ్య, సింగిల్ విండో చైర్మెన్ భీంరెడ్డి, మాజీ కౌన్సిలర్ల్ ఎంబేరి నాగభూషణం, జిందం లక్ష్మీనారాయణ, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

● పట్టణంలోని సాయిబాబ దేవాలయంలో జువ్వాడి నర్సింగరావు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. దేవాలయానికి వచ్చిన జువ్వాడికి ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బాలె నర్సయ్య డైరెక్టర్లు ఘనస్వాగతం పలికారు. అనంతరం దేవాలయంలో దత్తాత్రేయ అలయ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు.

మెట్‌పల్లి టౌన్: అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కోరుట్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పేర్కొన్నారు. మెట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ముగ్గురు లబ్ధిదారులకు లక్షా అరవై వేల రూపాయల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఆకుల లింగారెడ్డి, యూత్ అధ్యక్షుడు జెట్టి లక్ష్మణ్, మాజీ ఎంపీపీ నేరెళ్ల దేవేందర్, రాజయ్య, బత్తుల భరత్, నాయిని సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రేకర్ల ఏర్పాటు పనులు వారంలో పూర్తి చేయాలి

కథలాపూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మెన, భూషణరావుపేట గ్రామాల్లో 20 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు చేపడుతున్న బ్రేకర్ల ఏర్పాటు పనులు వారంలో పూర్తి చేయాలని కోరుట్ల ఎన్‌పీడీసీఎల్ డీఈఈ మధుసూదన్ సూచించారు. శుక్రవారం బొమ్మెన సబ్‌స్టేషన్‌లో జరుగుతున్న వీసీబీ బ్రేకర్ల పనులు, భూషణరావుపేటలో పల్సారబుల్ లొకేషన్లలో రెక్టిఫికేషన్ పనులను ఏడీఈ బొప్పరాతి రఘుపతితో కలిసి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఈ దివాకర్‌రావు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్ మెన్లు, జేఎల్‌ఎంలు ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

రాయికల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని రాయికల్ మండల ప్ర త్యేకాధికారి, జడ్పీ సీఈవో బి గౌతమ్ రెడ్డి అన్నారు. మండలంలోని అల్లీపూర్‌లో గల మహాత్మ జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలను శుక్రవారం సందర్శించారు.

పీఏసీఎస్‌లకు ప్రత్యేక అధికారులు

(5వ పేజీ తరువాయి)

పొడగించినట్లయింది. ప్రస్తుత చైర్మన్లకే పర్సన్ ఇన్‌చార్జిలుగా బాధ్యతలను అప్పగించింది.

● జిల్లాలో 51 సహకార సంఘాలు..

జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లో 51 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలున్నాయి. వీటిలో సుమారు 1.50 లక్షల మంది సభ్యులున్నారు. కరీంనగర్ కేంద్ర సహకార బ్యాంకు లిమిటెడ్ జగిత్యాల జిల్లా పరిధిలో 17 బ్రాంచీలున్నాయి. 2019 సంవత్స రంలో ఫిబ్రవరి మాసంలో సహకార సంఘాలకు ఎన్నికలు జరిగాయి. ఎన్నికైన పాలకవర్గాల గడువు ఈ ఏడాది ఫిబ్రవరి 14తో ముగిసింది. అయితే రాష్ట్రంలోని డీసీసీబీ చైర్మన్లంతా సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును కలిసి విజ్ఞప్తి చేయడంతో పదవీకాలం ఆరు నెలల పాటు పొడిగించింది. ఈ గడువు గత నెల 14తో ముగియడంతో.. మరో ఆరు నెలల పాటు పొడిగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. మొదటిసారి ఎలాంటి నిబంధనలు లేకుండా పదవీ కాలం పొడిగించిన ప్రభుత్వం ఈసారి మాత్రం నిబంధనల ప్రకారం ఉన్న వాటికి మాత్రమే వర్తింపజేయాలని నిర్ణయించడంతో సొసైటీల కొనసాగింపుపై ప్రభావం చూపింది.

● జిల్లాలో 23 సొసైటీలకు..

జిల్లాలోని 23 సొసైటీల్లో నిధుల దుర్వినియోగం, అవకతవకలు, అక్రమాలు, నిబంధనలు పట్టించుకోకపోవడం తదితర ఆరోపణలు ఎదుర్కొంటున్న 23 సొసైటీల పాలకమండళ్ల గడువు పొడిగింపును ప్రభుత్వం పక్కన బెట్టింది. సంబంధిత సొసైటీల పరిధిలో కొన్నేళ్లుగా నిధుల దుర్వినియోగం, పంట రుణాల జారీలో అక్రమాలు, సొసైటీ స్థలాల ఆక్రమణ, ఐకేపీ సెంటర్ల నుంచి వచ్చే కమీషన్ డబ్బులను ఇతర వాటికి వినియోగించడం తదితర ఆరోపణలతో సంబంధిత సొసైటీ చైర్మన్లను పర్సన్ ఇన్‌చార్జీల నుంచి తప్పించి ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులకు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. కాగా జిల్లాలో ఇప్పటికే పలు సొసైటీ చైర్మన్లకు, సీఈవోలకు నోటీసులు జారీ చేయగా, సమగ్ర విచారణ, కేసులు కొనసాగుతున్నాయి.

● పనితీరు మెరుగ్గా లేకపోవడంతోనే...

తాజా నిబంధనల ప్రకారం పనితీరు మెరుగ్గా ఉంటేనే వాటి పాలకవర్గాల గడువు పొడిగింపు ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకోసం సొసైటీల వారీగా పది అంశాలతో కూడిన సమాచారం అందించాల్సిందిగా జిల్లా సహకార శాఖను ఆదేశించింది. సొసైటీ పరిధిలో పాత బకాయిల పరిస్థితి... రుణాల తిరిగి చెల్లింపులు సక్రమంగా ఉన్నాయా, నిధుల దుర్వినియోగం ఏమైనా జరిగిందా.. జరిగితే వాటిపై ఎలాంటి విచారణ చేపట్టారు..దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చట్టపరంగా ఏమైనా చర్యలు తీసుకున్నారా.. సొసైటీ కార్యకలాపాలపై ఆడిట్ చేశారా..చట్టపరమైన చర్యలకు సంబంధించిన పిటిషన్ ఏదైనా పెండింగ్‌లో ఉందా...అనే తదితర వివరాలతో కూడిన సమాచారం పంపించాలని ససహకార శాఖ కమిషనర్ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. రంగంలోకి దిగిన ఆశాఖ అధికారులు సొసైటీల వారీగా సమాచారం సేకరించారు. పనితీరును గుర్తించి వివరాలతో కూడిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారు. తదనుగుణంగా తాజాగా 23 సొసైటీలకు అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ వ్యవహారం సహకార శాఖ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

సమస్యలు పరిష్కరించండి

జగిత్యాల అర్బన్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పడిన తమ కాలనీ సమస్యలు పరిష్కరించాలని జగిత్యాల పట్టణంలోని నూకపెల్లి అర్బన్ కాలనీ ప్రజలు శుక్రవారం జగిత్యాల మున్సిపల్ కమిషనర్ స్పందనకు వినతి పత్రం అందించారు. అర్బన్ కాలనీలో నీటికి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. రోడ్ నంబర్ 1 నుంచి 27 వరకు పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని, మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఎండీ ఖలీల్, బొల్లారపు స్వామి, కంటె విజయ, ఎండీ అక్మల్, శివాజి, రవి కుమార్, అజర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ భవన నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి

జగిత్యాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం (ఈజీఎస్), ఎస్ఆర్డీఎఫ్ నిధులతో మంజూరైన పంచాయతీ భవన నిర్మాణ పనులను సకాలంలో పూర్తిచేయాలని కలెక్టర్ సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో గ్రామపంచాయతీ భవనాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, భవిత సెంటర్లు, పాఠశాలల్లో గల కిచెన్ షెడ్, సౌచాలయాల నిర్మాణాలపై జిల్లా పంచాయతీ ఇంజనీరింగ్, ఎంపీడీవోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజగౌడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రఘువరన్, జిల్లా పంచాయతీ అధికారి మదన్ మోహన్, ఈపీఆర్వో లక్ష్మణ్‌రావు, ఎంపీడీవోలు, పంచాయతీ ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సాంకేతిక విజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అధునిక సాంకేతిక విజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని జగిత్యాల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ తత్వాది ప్రమోద్ కుమార్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి గణేష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో 'అంతర్జాలంలో తెలుగ భాష వినియోగం - ఉపాధి అవకాశాలు' అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు సహాయ అధ్యాపకురాలు డాక్టర్ గోలి శ్రీలత, చరిత్ర అధ్యాపకుడు మల్లికార్జున్, ఇంగ్లీష్ అధ్యాపకురాలు జ్యోత్స్న, కళాశాల ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఆడిట్ ఆఫీసర్ అంటూ సైబర్ నేరస్థుల ఫోన్

ధర్మపురి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో పలువురు వ్యక్తులకు సైబర్ నేరస్థులు ఫోన్‌కాల్ చేయడమే కాకుండా వాట్సాప్ ద్వారా మెసేజ్ పంపించారు. తాను బ్యాంక్ ఆడిట్ ఆఫీసర్ అంటూ శుక్రవారం పరిచయం చేసుకున్నాడు. బ్యాంక్‌కు లోన్ డబ్బులు చెల్లించాలని అంటూ ఒక వ్యాపారికి బెదరింపు కాల్స్ చేశారు. ఫోన్ పే ద్వారా వెంటనే డబ్బులు చెల్లించాలని లేకుంటే పోలీస్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ విషయమై సదరు వ్యాపారి బ్యాంక్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లగా సైబర్ నేరస్థులు ఇలా చేసి ఉంటారని అప్రమత్తంగా ఉండాలని ఆయన వివరించారు. సైబర్ నేరస్థుడు చేసిన ఫోన్ నంబర్ ఆధారంగా స్థానిక పోలీసులు విచారణ చేపట్టారు.

ఐకేపీ సీసీ కుటుంబసభ్యులకు పరామర్శ


పెగడపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల సెర్ప్ సీసీ రవికుమార్ కుటుంబాన్ని డీఆర్‌డీవో రఘువరన్ శుక్రవారం పరామర్శించారు. విధి నిర్వహణలో బాగంగా పెగడపల్లి మండల సీసీ రవికుమార్ గురువారం ప్రమాదవశాత్తు మరణించారు. కాగా శుక్రవారం రవికుమార్ అంతిమ యాత్ర జరుగగా డీఆర్‌డీవో రఘువరన్ నామాపూర్ చేరుకుని మృతదేహానికి నివాళులర్పించి, అంతిమ సంస్కారానికి ప్రభుత్వం తరపున రూ. 30 వేలు అందించి అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయ బోర్డును ఏర్పాటు చేయాలి

మెట్‌పల్లిటౌన్, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లిలోని కార్యాలయానికి సబ్ కలెక్టర్ కార్యాలయ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం మెట్‌పల్లి నియోజకవర్గ సాధన కమిటీ నాయకులు ఆర్డీవో కార్యాయలంలో ఏవో విజయలలితకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మెట్‌పల్లి నియోజకవర్గ సాధన కమిటీ అధ్యక్షుడు తోకల సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు గట్టయ్య, గోరుమంతుల సురేందర్, పోట్ల ప్రేమ్, దేశరాజ్, దేవలింగం, పుల్ల రాజా గౌడ్, గుంజేటి రాజరత్నాకర్, నీరటి రాజేందర్, అచ్చ లింగం,గంప శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థుల పెంపునకు కృషిచేయడం అభినందనీయం

రాయికల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి, విద్యార్థుల పెంపునకు రాయికల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని మండల విద్యాధికారి శ్రీపతి రాఘవులు అన్నారు. శుక్రవారం పాఠశాలలో డిజిటల్ తరగతులను ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కాపు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పురె శ్రీనివాస్, వేల్పుల గంగరాజం, లక్కడి రాజరెడ్డి, మండలోజు రవీందర్, మచ్చ స్వరూప తదితరులు పాల్గొన్నారు.



డిజిటల్ తరగతులను ప్రారంభిస్తున్న ఎంఈవో

● అవీ.. ఇవీ

కథలాపూర్: మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన మండల స్థాయి క్రీడల్లో (ఎస్‌జీఎఫ్) మాస్ట్రో పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్ 17 కబడ్డీ, షార్ట్‌పుట్ బాలికల విభాగాల్లో ప్రథమ స్థానం, వాలీబాల్, ఖోఖో, షార్ట్‌పుట్‌లో బాలుర విభాగంలో ద్వితీయ స్థానం, అండర్ 14 కబడ్డీ, ఖోఖోలో బాలుర విభాగంలో ద్వితీయ స్థానాల్లో తమ విద్యార్థులు విజేతలుగా నిలిచారని పాఠశాల కరస్పాండెంట్ ఆకుల రాజేశ్, ప్రిన్సిపాల్ ఆకుల రంజిత్ తెలిపారు.

మల్లాపూర్: మండలంలోని ఓబులాపూర్ తండాలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది రాథోడ్ శ్రీకర్, కవిత, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● బీడీ కార్మికుల సంక్షేమం కోసం కేంద్రం పథకాలు అమలు చేస్తోందని బీజేపీ జిల్లా కార్యదర్శి సంబరి కళావతి అన్నారు. మండల ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుక్రవారం మహిళ సంఘాలతో సమావేశం నిర్వహించారు.

మెట్‌పల్లి రూరల్: గ్రామాల్లో కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని జగ్గసాగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమావేశంలో మాట్లాడారు.

కోరుట్ల: ఈ నెల 15న నిర్వహించనున్న తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్టుపల్లి లక్ష్మణ్ కోరారు. శుక్రవారం మాట్లాడారు.

మెట్‌పల్లిటౌన్: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)బి.రాజాగౌడ్‌ను శుక్రవారం మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ టి మోహన్ కలెక్టరేట్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. టీపీవో రాజేంద్రప్రసాద్, ఆర్ఓ అజ్మతుల్లా బేగ్, ఇంచార్జి సానిటరీ ఇన్స్‌పెక్టర్ అక్షయ్, టిపిఎస్ అశోక్ ఉన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి ప్రాథమిక పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు గంగమణి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికైన సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు గుజ్జె గంగాధర్ సన్మానించారు. గ్రామ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ ఎడిపెల్లి గంగారెడ్డి, బీజేపీ నాయకులు మాలేపు శ్రీనివాస్, వెంకటస్వామి, కాంగ్రెస్ నాయకులు నాగేష్ ఉన్నారు.

కొడిమ్యాల: మండలంలోని చెప్యాల పాఠశాల ఉపాధ్యాయుడు చింతపండు రాము ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఉపాధ్యాయుడి కుటుంబ సభ్యులకు పీఆర్‌టీయూటీఎస్ సంక్షేమ సంఘం నుంచి లక్ష రూపాయల చెక్‌ను అందించారు. జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు బోయినిపల్లి ఆనందరావు, ప్రధాన కార్యదర్శి అమర్నాథ్‌రెడ్డి, శ్రీనివాస్, అంజయ్య ఉన్నారు.

పల్లెల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం

చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం

కొడిమ్యాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పల్లెల అభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందుతుందని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 46 మంది లబ్ధిదారులకు 12,16,500 రూపాయల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. అనంతరం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ అండర్ 14-17 క్రీడలను ప్రారంభించారు. అనంతరం మండలంలోని దమ్మయ్యపేట గ్రామ శివారులోని వరదరాయ చెరువును పరిశీలించి చెరువు అభివృద్ధి పనులను త్వరగా చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఒడ్డెర కుల సంఘ భవనాన్ని ప్రారంభిచారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బతుకమ్మ తెప్పె నిర్మాణం చేపట్టుతామన్నారు. గ్రామంలో పండగ లోపు హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేస్తామన్నారు. అంతక ముందు మండల కేంద్రంలోని పాఠశాలలో క్రీడాకారులు నిర్వహించిన మార్చ్ పోస్టులో గౌరవ వందనాన్ని ఎమ్మెల్యే స్వీకరించారు. క్రీడారంగం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో స్వరూప, చొప్పదండి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్, మల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ జీవన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్లు రాజనర్సింగరావు, రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాయణగౌడ్, కేంద్ర సహకార బ్యాంక్ మాజీ డైరెక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహిపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ముత్యం శంకర్‌గౌడ్, మల్లేశంయాదవ్, స్వామి, మ్యాకల మల్లేశం, చంద్రమోహన్‌రెడ్డి, స్వామి, రవి, గంగన్న, ఎంఈవో శ్రీనివాస్, పీడీ రాజమల్లయ్య, ప్రధానోపాధ్యాయురాలు విజయేంద్ర, సీఐ నీలం రవి పాల్గొన్నారు.



క్రీడలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

ఉత్తమమైన సేవలతోనే గుర్తింపు

జగిత్యాల (ఆంధ్రజ్యోతి): ఉత్తమమైన సేవలతోనే ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఈనెల 13వ తేదీన మల్యాల ఎక్స్ రోడ్డులో గల బంకెట్ హాల్‌లో వాసవి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య ఉపాధ్యాయ ఉత్సవ్ - 2025లో భాగంగా సుమారు 200 మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులకు సన్మాన మహోత్సవ ఆహ్వాన పత్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు నిర్వాహకులు అందించారు. సేవాభావంతో వాసవి ట్రస్ట్ పలు కార్యక్రమాలు నిర్వహిస్తుండడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో వాసవి ట్రస్ట్ వ్యవస్థాపకుడు పబ్బ శ్రీనివాస్, జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు నూనె శ్రీనివాస్, దువ్వ రాజు, గుండ శ్రీకాంత్, కాసం రాజశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసి ఎంపీగా గెలిచిన అర్వింద్

మెట్‌పల్లి టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులను మోసం చేసి ధర్మపురి అర్వింద్ ఎంపీగా గెలిచారని రాష్ట్ర కిసాన్ సెల్ జాయింట్ కోఆర్డినేటర్ వాకిటి సత్యంరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్‌తో కలిసి మాట్లాడారు. షుగర్ ఫ్యాక్టరీ తెరపైకి తెచ్చి రైతులను మోసం చేసి ఎంపీగా గెలిచిన అర్వింద్ అతర్వాత పట్టించుకోలేదని అన్నారు. త్వరలోనే షుగర్ ఫ్యాక్టరీని తెరిపించి రైతుల కళ్లల్లో ఆనందం చూసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులేస్తోందని అన్నారు. సమావేశంలో మెట్ పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఖుతుబోద్దీన్ పాషా,రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మారుతి, మల్లాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్ముల చిన్నారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి

కథలాపూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరూ సమష్టి కృషితో పనిచేసి తమ సత్తా చాటాలని మండల సేవాపక్షం ఇన్‌చార్జి లింగంపల్లి శంకర్ సూచించారు. మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సెప్టెంబరు 17 ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా రక్తదానం, స్వచ్ఛ భారత్ వంటి సేవా కార్యక్రమాలు అన్ని గ్రామాల్లో నిర్వహించాలని సూచించారు. అక్టోబరు 2 గాంధీ జయంతి వరకు కార్యక్రమాలు కొనసాగించాలని అన్నారు. జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షు డు మల్యాల మారుతి, జిల్లా కార్యవర్గ సభ్యులు కథలాపూర్ మహేశ్, నరెడ్ల రవి, గాంధారి శ్రీనివాస్, ప్రమోద్, శ్రీకర్, వినోద్, నారాయణ, కంటె రాజం ఉన్నారు.

పోలింగ్ బూత్‌ల్లో జాతీయ జెండా ఎగురవేయాలి

మల్యాల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా ఈనెల 17 వ తేదీన మండలంలో ప్రతీ పోలింగ్‌బూత్‌ల్లో జాతీయ జెండా ఎగురవేయాలని, శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించాలని బీజేపీ మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం సూచించారు. మల్యాలలో శుక్రవారం మండల స్థాయి సేవాపక్షం కార్యక్రమం నిర్వహించారు. 17న ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలని అయన అన్నారు. సమావేశంలో బత్తుల లక్ష్మీనారాయణ, కొల్లూరి గంగాధర్, రాచర్ల రమేష్, కొక్కెర మల్లేశం యాదవ్, బొట్ల ప్రసాద్, ముదుగంటి రాజు, చక్రంగౌడ్, లత, రమ, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

చక్కర కర్మాగారం పునరుద్ధరణకు కట్టుబడి ఉన్నాం

- మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నిజాం చక్కర కర్మాగారం పునరుద్ధరణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి, ధర్మపురి దేవస్థాన అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ జువ్వాడి కృష్ణారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో రైతులు వరికి ప్రత్యామ్నాయంగా చెరుకు సాగు చేపట్టారన్నారు. నిజాం చక్కర కర్మాగారానికి అనుగుణంగా చెరుకు సాగు చేపట్టారని తెలిపారు. చక్కర ఫ్యాక్టరీ నిర్వహణలో అలసత్వంతో టీడీపీ పాలనలో 51 శాతం వాటాను ప్రైవేట్ పరం చేశారని వివరించారు. బీఆర్ఎస్ పాలనలో పూర్తిగా మూసివేశారని విమర్శించారు. నిజాం చక్కర కర్మాగారాని పీసీసీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న సమయంలో రేవంత్‌రెడ్డి సందర్శించి, చక్కర కర్మాగారం పునఃప్రారంభిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, సీనియర్ నాయకులు గాజుల రాజేందర్, కోట దుర్గయ్య, రాధా కిషన్‌రావు, జున్ను రాజేందర్, గోవిందు లక్ష్మీనారాయణ, నల్ల స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

మెట్‌పల్లిటౌన్, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 15వ వార్డుకు చెందిన సాంబారి హరీష్ ప్రమాదవశాత్తు గాయపడగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు ద్యావనపల్లి రాజారాం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఆకుల లింగారెడ్డి, మాజీ ఎంపీపీ నేరేళ్ల దేవేందర్, యూత్ అధ్యక్షుడు జెట్టి లక్ష్మణ్ ఉన్నారు.